


ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

అన్నమయ్య
జిల్లా వార్తలు
5
మంగళవారం 6 మే 2025


స్థలాన్ని పరిశీలిస్తున్న ఒబెరాయ్ సంస్థ ప్రతినిధులు (ఫైల్)


ఒబెరాయ్ స్టార్ హోటల్ కోసం హార్సిలీహిల్స్‌లో కేటాయించిన స్థలం

ఆంధ్రా ఊటీగా పేరొందిన హార్సిలీహిల్స్‌లో అభివృద్ధి జాడే కనిపించడం లేదు. సముద్ర మట్టానికి 4312 అడుగుల ఎత్తులో ఉన్న హిల్స్‌లో ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. ఇక్కడ చల్లటి వాతావరణం ఉండటంతో వేసవిలో పర్యాటకులు ఎక్కువగా వస్తుంటారు. పర్యాటకులకు తగ్గట్లుగా ఇక్కడ సరైన వసతులు లేవు. హిల్స్‌కు అంతర్జాతీయంగా గుర్తింపు తెచ్చేందుకు ఒబెరాయ్ సంస్థ ఇక్కడ రూ.200 కోట్లతో లగ్జరీ విల్లాస్, హెలీపాడ్‌తో కూడిన ఫైవ్ స్టార్ రిసార్ట్ నిర్మాణం చేపట్టేందుకు ముందుకు వచ్చింది. అయితే ఆ ప్రాజెక్టు నిర్మాణానికి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఇక్కడ ఏర్పాటు చేస్తామన్న క్రీడా శిక్షణ కేంద్రం పనులు కూడా జరగలేదు.


హార్సిలీహిల్స్ వ్యూ


హిల్స్‌లో అభివృద్ధి జాడేది..?

- ముందుకు సాగని రూ.200 కోట్ల ప్రాజెక్టు
- ఒబెరాయ్ హోటల్ నిర్మాణంపై నీలినీడలు
- ఉలుకు పలుకు లేని క్రీడా శిక్షణా కేంద్రం పనులు
- హార్సిలీహిల్స్‌ను పట్టించుకోని పాలకులు

బి.కొత్తకోట, మే 5 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండల పరిధిలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌లో అభివృద్ధి పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో టూరిజం మంత్రిగా ఉన్న రోజా హార్సిలీహిల్స్ వైపు కన్నెత్తి చూడకపోవడంతో అభివృద్ధి ఏదీ జరగకపోగా రూ.కోట్ల విలువైన క్రీడా శిక్షణా కేంద్ర స్థలాన్ని సినీ నిర్మాత రాఘవకు అప్పనంగా ధారాదత్తం చేయాలని విఫలయత్నం జరిగింది. ఆ గుట్టు కాస్తా రట్టు కావడంతో వెనక్కు తగ్గారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే హిల్స్ అభివృద్ధిపై దృష్టి సారించింది. పెండింగ్‌లో ఉన్న ఒబెరాయ్ స్టార్ హోటల్ నిర్మాణంలో కదలిక వచ్చింది. ఆ సంస్థ ప్రతినిధులు స్వయంగా వచ్చి పరిశీలించడంతో పనులు ప్రారంభమవుతాయని హిల్స్ దశ తిరుగుతుందని అందరూ భావించారు. అయితే అది అందని ద్రాక్షలానే కనబడుతోంది. పర్యాటకం, అటవీశాఖ, రోడ్లు భవనాలు, క్రీడా మంత్రిత్వ శాఖల నుంచి ఆశించినా స్పందన లేకపోవడంతో పర్యాటకులను ఆకర్షించేందుకు కొత్త ప్రయత్నాలేవీ జరగకపోవడంపై పలు రకాల చర్చలు నడుస్తున్నాయి.

ఒబెరాయ్ హోటల్ నిర్మాణంపై అనుమానాలు..

హార్సిలీహిల్స్‌పై సర్వే నెంబరు 591-2, 572లలో 19.80 ఎకరాల స్థలాన్ని రెవెన్యూ శాఖ పర్యాటక రంగానికి కేటాయిస్తూ జీవో జారీ చేసింది. ఈ స్థలాన్ని పర్యాటక శాఖ ఒబెరాయ్ సంస్థకు కేటాయించింది. రూ.200 కోట్లతో లగ్జరీ విల్లాస్, హెలీపాడ్‌తో కూడిన ఫైవ్ స్టార్ రిసార్ట్ నిర్మాణం చేపడతారని అందరూ ఎదురుచూసినా గత ప్రభుత్వం చొరవ చూపకపోవడంతో అమలుకు నోచుకోలేదు. తాజాగా సీఎం చంద్రబాబు చొరవతో ఈ ప్రాజెక్టుపై కదలిక వచ్చింది. గత ఏడాది ఆగస్టు 27న సంస్థ ప్రతినిధులు హార్సిలీహిల్స్‌కు వచ్చి తమ సంస్థకు కేటాయించిన స్థలాన్ని రిసార్ట్ నిర్మాణానికి సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. కలెక్టర్ శ్రీధర్, జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, హిల్స్ టౌన్‌షిప్ కమిటీ ఛైర్మన్ మేఘ స్వరూప్ ఒబెరాయ్ ప్రతినిధులకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా హార్సిలీహిల్స్‌లో ప్రాజెక్టు నిర్మాణానికి అనువైన పరిస్థితులను వివరించారు. చర్చల అనంతరం రెండు నెలల్లో నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని కలెక్టర్ ప్రకటించారు. ఇది జరిగి 6 నెలలైనా దాని ఊసేలేదు. దీంతో ఒబెరాయ్ హోటల్ నిర్మాణంతో పర్యాటకపరంగా జాతీయస్థాయిలో నిలుస్తుందని, దేశ విదేశాలకు చెందిన పర్యాటకులను ఆకర్షించవచ్చన్న ఆశయం నెరవేరేలా లేదు. రాష్ట్రవ్యాప్తంగా ఏడు పర్యాటక కేంద్రాలలో పెట్టుబడులు పెట్టడానికి ఈ సంస్థ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. అయితే తిరుపతి రూరల్ మండలం పేరూరు వద్ద నిర్మించతలపెట్టిన స్టార్ హోటల్ నిర్మాణానికి హిందూ సంఘాలు అభ్యంతరం చెబుతూ నిరసన కార్యక్రమాలు చేపట్టడంతో దాని అనుమతులను రద్దు చేశారు. ఈ నేపథ్యంలో హార్సిలీహిల్స్‌లో ప్రాజెక్టు అమలుపై అనుమానాలు మొదలయ్యాయి.


క్రీడా శిక్షణా కేంద్రానికి కేటాయించిన స్థలం

క్రీడా శిక్షణా కేంద్రం పనులు ఏవీ?

అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేయాలన్న లక్ష్యంతో సముద్ర మట్టానికి 4312 అడుగుల ఎత్తులో ఉన్న పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌లో టీడీపీ హయాంలో 3.74 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. ఈ శిక్షణా కేంద్రంలో ఇండోర్ గేమ్స్‌తో పాటు అథ్లెటిక్స్‌లో క్రీడాకారులకు శిక్షణ ఇవ్వాల్సి ఉంది. ఇందుకోసం రూ.3.20 కోట్లు మంజూరు చేశారు. ఇందులో రూ.2.20 కోట్ల మేర ఖర్చు చేశారు. చుట్టూ ప్రహరీని నిర్మించారు. మిగిలిన పనులు జరగలేదు. ఈ పనులు పూర్తి చేయడానికి ఎన్నిసార్లు గడువు పొడిగించినా కాంట్రాక్టరు చేయలేదు. ఇదే స్థలాన్ని సినీ దర్శక నిర్మాత మహీ రాఘవకు మినీ స్టూడియో నిర్మాణం పేరుతో కట్టబెట్టేందుకు వైసీపీ ప్రభుత్వ హయాంలో తీవ్ర ప్రయత్నం జరిగింది. అయితే రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు అభ్యంతరం చెప్పడంతో పాటు మీడియాలో కథనాలు రావడంతో రూ.కోట్ల విలువైన ఈ 3.74 ఎకరాల స్థలం మిగిలింది. అయితే కూటమి ప్రభుత్వంలోనూ ఈ శిక్షణా కేంద్ర పనులు మొదలు కాలేదు. రాష్ట్ర క్రీడల శాఖా మంత్రిగా జిల్లాకే చెందిన మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఉన్నారు. ప్రస్తుతం మిగిలి ఉన్న నిధులకు తోడు మరిన్ని నిధులు విడుదల చేయిస్తే క్రీడా శిక్షణా కేంద్రం రూపుదాల్చి ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది. వీటితో పాటు హార్సిలీహిల్స్‌లో పర్యాటకులను ఆకర్షించేందుకు చేపట్టాల్సిన పనులు ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. అటవీ ప్రాంగణంలో సాహస క్రీడల సముదాయం కోసం స్థలం కేటాయించారు. ఏపీ టూరిజం ఆధీనంలోని అతిథి గృహాల ఆధునికీకరణ, కాలం చెల్లిన నీటి సరఫరా వ్యవస్థ, పారిశుధ్య నిర్వహణ, పర్యాటకుల రక్షణకు ప్రత్యేక సిబ్బంది, ఘాట్ రోడ్డులో రక్షణ గోడల మరమ్మతులు, తారురోడ్డు పనులు తదితర పనులన్నీ ప్రతిపాదనల్లోనే ఉన్నాయి. ప్రభుత్వం చొరవ చూపితే హార్సిలీహిల్స్‌కు మరింత వైభవం వస్తుంది.

ప్రజల సమస్యలపై శ్రద్ధ పెట్టండి

- తహసీల్దార్లు, ఎంపీడీవోలు తీరు మార్చుకోకుంటే కఠిన చర్యలు
- కలెక్టర్ చామకూరి శ్రీధర్


అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలపై శ్రద్ధ పెట్టి చిన్న చిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల స్థాయిలో ఉన్న ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా అధికారులు శ్రద్ధ పెట్టి చిన్న చిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలో కొంత మంది తహసీల్దార్లు, ఎంపీడీవోల తీరు సరిగ్గా లేదని వారు తీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని వారు మరొకసారి హెచ్చరించారు. జిల్లా కేంద్రంలో రెవెన్యూ సిబ్బంది ప్రజల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని, తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. అర్జీదారుడు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేస్తే వెంటనే క్షేత్రస్థాయికి వెళ్లి తహసీల్దార్‌లు పరిశీలించకుండా కేవలం వీఆర్‌వో ఇచ్చిన సమాచారం మీదనే ఆధారపడి ఉండడం వల్లనే సమస్యలు అధికమవుతున్నాయని తెలిపారు. ప్రతి అర్జీదారుడికి న్యాయం జరగాలంటే క్షేత్రస్థాయిలో తహసీల్దార్లు వెళ్లి పరిశీలించి పూర్తి సమాచారంతో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌వో మధుసూదన్‌రావు, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, ఎస్‌డీసీ రాఘవేంద్ర, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి అందిన కొన్ని విజ్ఞప్తులు

రాయచోటి మండలానికి చెందిన ఇంజేటి భాగ్యమ్మ మూడు సంవత్సరాల క్రితం తన భర్త చనిపోయాడని, తనకు వితంతు పింఛన్ వచ్చేలా చూడాలని కలెక్టర్‌కు విన్నవించుకుంది. పెద్ద తిప్పసముద్రం మండలానికి చెందిన శివరాం తనకు వచ్చే వికలాంగ పింఛన్ గత ప్రభుత్వంలో తొలగించారని తన పింఛన్‌ను పునరుద్ధరించాలని కోరింది. వాల్మీకిపురం మండలానికి చెందిన వెంకటరమణ మాట్లాడుతూ తాను ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నానని నాకు పెరాలసిస్ వచ్చిందని, దగ్గరగా ఉండే పాఠశాలకు తనను బదిలీ చేయాలని కలెక్టర్‌ను కోరారు.

12 నుంచి అన్నమయ్య జయంతి ఉత్సవాలు

రాజంపేట, మే 5 (ఆంధ్రజ్యోతి) : పదకవితా పితామహుడు అన్నమాచార్యుల 617వ జయంతి ఉత్సవాలు ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు జరగనున్నాయి. అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాకలో, అన్నమయ్య 108 అడుగుల వద్ద మూడు రోజుల పాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీ తెలిపారు. 12వ తేదీ ఉదయం అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులచే గోష్ఠిగానం, 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు శ్రీవారి కల్యాణం, సాయంత్రం 6 నుంచి 8.30 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. అదేవిధంగా 13, 14 తేదీల్లో అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాకలో, బోయనపల్లెలోని 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వద్ద సాయంత్రం 6 గంటల నుంచి 8.30 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున భక్తులు అధిక సంఖ్యలో ఈ ఉత్సవాలకు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం చేయొద్దు

- ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు


బాధితుడి వద్దకు వచ్చి సమస్యను తెలుసుకుంటున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటి టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం చేయకుండా త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన రాయచోటి పట్టణంలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి వారికి ముఖాముఖీ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితుల సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి బాధితులకు చట్ట పరిధిలో తక్షణ న్యాయం అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నడవలేని స్థితిలో పీలేరు నుంచి దివ్యాంగుడు మోపిరెడ్డి రాంమోహన్‌రెడ్డి తన సమస్య చెప్పుకునేందుకు ఎస్పీ కార్యాలయానికి వచ్చారు. విషయం తెలుసుకున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆయనే స్వయంగా బాధితుడి వద్దకే వెళ్లి సమస్య విని అతను ఇచ్చిన ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి చట్ట పరిధిలో సమస్యను పరిష్కరించాలని పీలేరు సీఐని ఆదేశించారు. అనంతరం మండుటెండలో తమ సమస్యలను ఎస్పీకి తెలుపుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులకు చల్లని మజ్జిగ, నీరు పంపిణీ చేశారు.

జగన్ కోటలో మహానాడు

- 5 లక్షల మందితో బహిరంగ సభ
- నాలుగు రోజుల ముందే కడపలో లోకేశ్ తిష్ఠ
- జిల్లా సమగ్రాభివృద్ధికి స్పష్టమైన డిక్లరేషన్
- రేపు భూమిపూజ
- హాజరుకానున్న ఇన్‌చార్జ్ మంత్రి సవిత, రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్..?


మహానాడు ఏర్పాట్లను పరిశీలిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

(కడప-ఆంధ్రజ్యోతి): కడప గడపలో ఈనెల 27, 28, 29న నిర్వహించే మహానాడును నభూతో నభవిష్యత్‌గా నిర్వహించేందుకు టీడీపీ పక్కా ప్లాన్ చేస్తోంది. నిన్న జరిగిన ఎన్నికల్లో ఉమ్మడి కడప జిల్లాలో వైసీపీకి చావు దెబ్బ కొట్టింది. మిత్రపక్షాలతో కలిసి మట్టికరిపించింది. ఇది స్టేట్‌లోనే సంచలనమైంది. ఇక జగన్ కోటలో మహానాడును కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఏర్పాట్లు కూడా మొదలయ్యాయి. జగన్ సొంత గడ్డ కడపలోనే మహానాడును భారీ సక్సెస్ చేసి టీడీపీ తన పూర్వవైభవం కోసం అడుగులు వేస్తోంది. స్టేట్‌లో ఇతర జిల్లాల్లో ఇప్పటి దాకా నిర్వహించిన మహానాడు ఒక ఎత్తు అయితే, ఈసారి కడపలో మరో ఎత్తు కానుంది. అందుకు మహానాడును భారీ సక్సెస్ చేసేందుకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారాలోకేశ్ కార్యక్రమానికి నాలుగురోజుల ముందే కడపలో మకాం వేసి దగ్గరుండి ఏర్పాట్లు, ఇతరత్రా పర్యవేక్షించనున్నట్లు ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి.

ప్రతిష్ఠాత్మకంగా మహానాడు

ఉమ్మడి కడప జిల్లాలో టీడీపీ ఆవిర్భావం నుంచి 2004 ముందు వరకు టీడీపీ ఎమ్మెల్యేలే గెలుస్తూ వచ్చేవారు. బద్వేలు, జమ్మలమడుగు, కడప, రైల్వేకోడూరు ఇలా కొన్ని నియోజకవర్గాలు కంచుకోటలా ఉండేవి. అయితే 2024 ఎన్నికల్లో పార్టీ పుంజుకుంది. ఉమ్మడి జిల్లాలో ఏడు స్థానాలు కూటమికి వచ్చాయి. సొంత జిల్లాలో వైసీపీ చతికిలబడడం ఆ పార్టీ ఊహించలేకపోయింది. ఆ షాక్ నుంచి కోలుకోక మునుపే మళ్లీ మహానాడును కడపలో నిర్వహించి సీమ అభివృద్ధితో పాటు జిల్లా అభివృద్ధికి ప్రత్యేక రోడ్‌మ్యాప్ గీసి అటు పరిశ్రమలు, ఇటు వ్యవసాయరంగంపై పూర్తి స్పష్టత ఇవ్వనున్నారు. కడపకు వచ్చే భారీ ప్రాజెక్టులను సస్పెన్స్‌లో ఉంచారు. మహానాడు వేదికలో సీఎం చంద్రబాబు వెల్లడిస్తారని చెబుతున్నారు. వైజాగ్, చెన్నై పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా కొప్పర్తి ఇండస్ట్రియల్ పార్కును అభివృద్ధి చేయనున్నారు. ఇది పూర్తయితే పరిశ్రమలు క్యూ కడతాయి. ఇప్పటికే కొప్పర్తిలో పలు పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు పలువురు ముందుకు వస్తున్నారు.

ఉక్కుపై ముందుకు

కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు జిల్లావాసుల చిరకాల వాంఛ. అయితే మూడేళ్లలో స్టీలు ఫ్యాక్టరీ పూర్తి చేస్తామని జగన్ కొబ్బరికాయ కొట్టారు. ఐదేళ్ల పూర్తయ్యే సరికి కనీసం ప్రహరీగోడ కూడా పూర్తి చేయలేకపోయారు. కాగా కడపలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మిస్తామని ఇటీవల చంద్రబాబు ప్రకటించారు. జిందాల్‌తోనే నిర్మాణం చేపడుతుందని అంటున్నారు. దీంతో పాటు ఇక మహానాడు సక్సెస్ చేసి టీడీపీలో మరింత జోష్ నింపాలని భావిస్తున్నారు. ఇందుకు మంత్రి నారా లోకేశ్ నాలుగు రోజులు ముందుగానే కడపలో మకాం వేసి అందరినీ సమన్వయం చేసుకుంటూ పర్యవేక్షించనున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

రేపే భూమి పూజ

కడప నగర శివారులోని పబ్బాపురంలో ఉన్న 120 ఎకరాల టీచర్స్ లేఅవుట్‌లో మహానాడు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే పనులు మొదలయ్యాయి. అయితే రేపు స్టేజీ ఇతర నిర్మాణాల కోసం భూమి పూజ చేయనున్నారు. కార్యక్రమానికి కడప జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సవితతో పాటు రాయలసీమకు చెందిన పలువురు మంత్రులు హాజరు కానున్నారు. భూమిపూజకు రావాల్సిందిగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను కూడా ఆహ్వానించినట్లు శ్రీనివాసరెడ్డి తెలిపారు. మహానాడు లేఅవుట్ తయారు చేసి ఎక్కడెక్కడ, స్టేజీ ప్రతినిధుల సమావేశం కోసం ఏర్పాటు చేసే మీటింగ్ హాలు, గ్యాలరీలు, పార్కింగ్, సీఎం చంద్రబాబుకు బస వసతి, భోజనశాలలు, వీఐపీలకు ప్రత్యేక భోజనశాల, రక్తదాన శిబిరం, ఫొటో ఎగ్జిబిషన్ తదితరాలు నిర్ణయించనున్నారు.

కమిటీలు

ఇక మహానాడును సక్సెస్ చేసేందుకు సమన్వయం కోసం పలు కమిటీలను నియమించనున్నారు. వేదిక, ఆహ్వానం, వంట తదితరాల కోసం పలు కమిటీలను ఏర్పాటు చేసి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లను చేయనున్నారు.

చరిత్రలో నిలిచిపోయేలా మహానాడు

కడపలో నిర్వహించే మహానాడు చరిత్రలో నిలిచిపోనుంది. చివరి రోజున ఐదు లక్షల మందితో భారీ బహిరంగ సభ జరగనున్నది. జగన్ ఐదేళ్లలో స్టీలు ఫ్యాక్టరీకి శంకుస్థాపనలు చేయడమే తప్ప దాన్ని పూర్తి చేయలేదు. జిందాల్‌తోనే స్టీలు ఫ్యాక్టరీ పూర్తి చేస్తాం.. ఒప్పందం కూడా జరిగిపోయింది. కడప జిల్లా సమగ్రాభివృద్ధికి ఓ ప్రత్యేక డిక్లరేషన్‌ను మహావేదికలో చంద్రబాబు ప్రకటిస్తారు. మహానాడు సక్సెస్‌తో వైసీపీ కోలుకోలేని విధంగా మారుతుంది.

● ఆర్.శ్రీనివాసరెడ్డి, పొలిట్‌బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు

నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

- ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): రాయచోటి నియోజకవర్గంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని, ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు లాంటివని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం రాయచోటి పట్టణంలోని స్టేట్ గెస్ట్‌హౌస్‌లో మంత్రి పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా రాయచోటి నియోజకవర్గంలో మారుమూల ప్రాంతాలకు చెందిన ఏడురోడ్ల అభివృద్ధికి నాబార్డు కింద రూ.4 కోట్ల 16 లక్షలు, ఆర్ఐడీఎఫ్ కింద రూ.2 కోట్ల 6 లక్షలు మంజూరు చేయించారని తెలిపారు. ఇందులో మొత్తం రూ.6 కోట్ల 25 లక్షల రూపాయలతో రాయచోటిలో ఉన్న నాలుగు మండలాలకు సంబంధించి ఆరు రోడ్ల అభివృద్ధికి టెండర్లు పిలిచినట్లు తెలిపారు. రాయచోటి మండల పరిధిలోని శిబ్యాల గ్రామంలో 700 ఎకరాలను ఎస్ఈజెడ్‌కు ప్రభుత్వం గుర్తించిందన్నారు. ఈ ప్రాంతంలో ఇండస్ట్రియల్ పార్కు నిర్మించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. దీంతో చిన్న పరిశ్రమలు కూడా మన ప్రాంతానికి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ప్రస్తుత వేసవి కాలంలో నియోజకవర్గంలో ఎక్కడా కూడా నీటి సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షలు నిర్వహించి నీటి సమస్యను పరిష్కరిస్తున్నామని తెలిపారు. నీటి సౌలభ్యం లేని ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నో ఏళ్లుగా రాయచోటి నియోజకవర్గంలోని 6 మండలాలకు నీటి సమస్య అధికంగా ఉందని ఈ సమస్య వచ్చే వేసవి నాటికి తీర్చేందుకు సుమారు 300 కోట్ల రూపాయలతో 6 మండలాలకు వెలిగల్లు నుంచి నీటిని అందించే బృహత్తర కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వ పథకం జల్ జీవన్ మిషన్ కింద టెండర్లు పిలిచినట్లు తెలిపారు. అంతేగాక మండిపల్లి నాగిరెడ్డి శ్రీనివాసపురం రిజర్వాయర్ కింద ఉండే 25 వేల ఎకరాల ఆయకట్టుకు కూడా నీరు అందించి ఆ చుట్టుపక్కల ఉన్న గ్రామాల్లో భూగర్భజలాలు సమృద్ధిగా పెరిగేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. శ్రీనివాసపురం రిజర్వాయర్ కింద గత ప్రభుత్వంలో ఏవైతే పనులు నిలిచిపోయాయో అవన్నీ కూడా పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రూ.320 కోట్లు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో రాయచోటి నియోజకవర్గం సస్యశ్యామలం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మంత్రి కోరారు.

ఏడాదిగా ఎక్కడికక్కడే..

పులివెందుల వద్ద నిర్మిస్తున్న మెడికల్ కళాశాల పనులు ఏడాది కాలంగా ఎక్కడిపనులు అక్కడే ఆగిపోయాయి. దాదాపు రూ.500కోట్లతో ప్రారంభించి రూ.380కోట్లు ఖర్చుచేసినా అసంపూర్తి పనుల కారణంగా ఇంకా వినియోగంలోకి రాని దుస్థితి. మరో రూ.120కోట్లు ఖర్చుచేస్తే మెడికల్ కళాశాల, ఆసుపత్రి వినియోగంలోకి రానున్నాయి. కానీ ఎప్పటికి ఈ పనులు పూర్తవుతాయో అన్న ప్రశ్న ప్రశ్నగానే మిగిలే అవకాశం కనిపిస్తోంది.



70శాతం పనులు పూర్తయిన ఐపీ భవనం

- నిలిచిపోయిన మెడికల్ కళాశాల పనులు
- రూ.380కోట్లు ఖర్చు చేసినా అసంపూర్తిగానే

పులివెందుల, మే 5 (ఆంధ్రజ్యోతి): పులివెందుల ప్రాంత ప్రజల కోసం అప్పటి రాష్ట్ర ప్రభుత్వం రూ.500కోట్లతో దాదాపు 25ఎకరాల్లో మెడికల్ కళాశాలతో పాటు అధునాతన ఆసుపత్రిని నిర్మించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 2022లో ఈ మెడికల్ కళాశాల పనులు ప్రారంభించారు. ఈ పనులను ఓ ప్రైవేట్ సంస్థకు అప్పగించారు. పనులు ఆది నుంచి కూడా వేగంగా సాగలేదని చెప్పాలి. పనులు ప్రారంభమై టెండర్ల దశలో, బిల్లులు కాక దాదాపు ఆరు నెలల పాటు పనులు ఆగిన పరిస్థితి ఇక్కడ నెలకొంది. సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సొంత నియోజకవర్గంలో మెడికల్ కళాశాల పనులు ఆగిపోవడం అందరిని ఆశ్చర్యానికి గురిచేసింది. నిధులు విడుదల కాకపోవడంతో పనులు ఆగిపోయాయని విమర్శలు రావడంతో మళ్లీ పనులు ప్రారంభించారు. పనులు ప్రారంభించినప్పటికీ నిర్దేశించిన పనులు పూర్తికాలేదు. 2024 ఎన్నికలు దగ్గరపడుతుండడంతో ఆసుపత్రిని ప్రారంభించింది. మెడికల్ కళాశాలకు సంబంధించిన భవనాల నిర్మాణాలు పూర్తికాలేదు. కానీ ఆసుపత్రికి సంబంధించిన భవనాలు పూర్తయ్యాయని అప్పటి ముఖ్యమంత్రి చేత ప్రారంభించారు. ఆసుపత్రి భవనాలు కూడా పూర్తిస్థాయిలో నిర్మాణం కాలేదు. ఓపీ, ఐపీ, అత్యవసర సేవల విభాగాల భవనాలు కూడా పూర్తికాకపోవడంతో కాంట్రాక్టు సంస్థ దగ్గర నుంచి ప్రభుత్వం స్వాధీనం చేసుకోలేదు.

పూర్తి కాకుండానే ప్రారంభం

ఆసుపత్రికి సంబంధించిన ఓపీ విభాగం, ఐపీ విభాగం, అత్యవసర సేవల విభాగం ఇలా మూడు విభాగాలలో కూడా పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఓపీ విభాగానికి సంబంధించి 80శాతం, ఐపీ విభాగానికి సంబంధించి 70శాతం, అత్యవసర సేవల విభాగానికి సంబంధించి 40శాతం పనులు పూర్తి అయినట్లు సమాచారం. మెడికల్ కళాశాల పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. మెడికల్ కళాశాల భవనాలు అసంపూర్తిగానే ఉన్నాయి. కేవలం ఒక అంతస్తు స్లాబ్ పూర్తిచేశారు. మిగిలినదంతా పిల్లర్ల దశలోనే ఉంది. అలాగే విద్యార్థుల హాస్టల్, లైబ్రరీ భవనాలు కూడా పూర్తికాలేదు. ల్యాబ్‌ది అదే పరిస్థితి. ఇలా అన్ని పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. ఇప్పటికి దాదాపు రూ.500కోట్ల పనులకుగాను రూ.380కోట్ల పనులు పూర్తయినట్లు ఓ అధికారి వెల్లడించారు. నిర్మాణ పనులు చేపట్టిన సంస్థ ప్రభుత్వం నుంచి రూ.10 నుంచి రూ.20కోట్ల దాకా బిల్లులు రావాల్సి ఉందన్నారు.

ఏడాదిగా ముందుకు సాగని పనులు

2024 ఎన్నికలకు దాదాపు రెండు నెలల ముందు నుంచే పనులు నత్తనడకన సాగాయి. ఎన్నికల సమయానికి పనులు పూర్తిగా ఆగిపోయాయి. ఎన్నికలు అయిపోయి ఏడాది గడిచింది. అంటే ఏడాది కాలంగా కూటమి ప్రభుత్వం ఈ పనులపై ఎటువంటి చర్య తీసుకోలేదు. ప్రస్తుతానికి ఈ భవనాల్లో ఓపీ, ఎమర్జెన్సీ విభాగాల్లో ఆసుపత్రి నడుపుతున్నారు. కేవలం ఆసుపత్రి నిర్వహణ చేపట్టడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. మరో రూ.100 నుంచి రూ.120 కోట్లు ఖర్చుచేస్తే మెడికల్ కళాశాల ప్రారంభమవుతుంది. పులివెందుల ప్రాంతంతో పాటు చుట్టుపక్కల ప్రజలకు అధునాతన వైద్యం అందనుంది. ఏదిఏమైన పులివెందుల మెడికల్ కళాశాల పనులు ఏడాదిగా ఎక్కడి పనులు అక్కడే అన్నట్లున్నాయి.



పూర్తికాని హాస్టల్ భవనాలు



పిల్లర్ల దశలోనే మెడికల్ కళాశాల భవనం

ముస్లిం మైనార్టీల పట్ల వైసీపీ మొసలి కన్నీరు

- వక్ఫ్ సవరణ చట్టంపై డబుల్ గేమ్ : తులసిరెడ్డి

వేంపల్లె, మే 5 (ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనార్టీల పట్ల వైసీపీది మొసలి కన్నీరు, వక్ఫ్ సవరణచట్టంపై డబుల్ గేమ్ ఆడుతోందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. వేంపల్లెలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ లోక్‌సభలో వక్ఫ్ సవరణ చట్టానికి వైసీపీ వ్యతిరేకంగా ఓటు వేసిందని, కానీ రాజ్యసభలో అనుకూలంగా ఓటువేసి డబుల్‌గేమ్ ఆడిందన్నారు. పౌరసత్వ సవరణచట్టానికి కూడా బీజేపీకి అనుకూలంగా వైసీపీ ఓటు వేసిందన్నారు. బీజేపీ చేతిలో టీడీపీ, జనసేన, వైసీపీలు కీలుబొమ్మలన్నారు. అలాగే బీజేపీపుట్టక ముందే హిందూఅనే పదం వాడుకలో ఉందన్నారు. 1915లో హిందు మహాసభ, 1925లో ఆర్‌ఎస్‌ఎస్, 1951లో భారతీయ జనసంఘ్, 1964లో విశ్వహిందూ పరిషత్, 1980లో బీజేపీ పుట్టిందన్నారు. బీజేపీది నకిలీ జాతీయ వాదమని విమర్శించారు.

ఉరి వేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

జమ్మలమడుగు, మే 5 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలం దేవగుడి గ్రామంలో ఆదివారం ఇంటి వద్ద నుంచి వెళ్లి గూడెంచెరువు మాబు (72) అనే వృద్ధుడు విద్యుత్తు స్తంభానికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు.. గూడెంచెరువు మాబు ఆదివారం ఇంటి వద్ద నుంచి కనపడకుండా వెళ్లిపోయాడు. సోమవారం రాబడిన సమాచారం మేరకు దేవగుడి, సలివెందుల గ్రామాలకు వెళ్లినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఆత్మహత్యకు పాల్పడిన వృద్ధుడి భార్య గత కొన్ని నెలల క్రితం మృతి చెందింది. అప్పటి నుంచి ఆయన ఆరోగ్యం సహకరించక అనారోగ్యానికి గురయ్యాడు. జీవితంపై విరక్తి చెంది గ్రామం శివార్లలో ఉన్న తన పొలంలోకి వెళ్లి విద్యుత్తు స్తంభానికి పంచెతో ఉరి వేసుకున్నాడు. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు మహబూబ్‌బాష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

హోంగార్డుగా కారుణ్య నియామకం



నియామక పత్రం అందిస్తున్న ఎస్పీ

కడప క్రైం, మే 5(ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఎస్.రఘువర్మ (హెచ్‌జీ 486) సతీమణి కె.విజయమేరీకి కారుణ్య నియామకం కింద హోంగార్డుగా నియామకపత్రాన్ని ఎస్పీ అశోక్‌కుమార్ సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అందించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అంకితభావంతో విధులు నిర్వర్తించే సిబ్బంది మరణించడం బాధాకరమని, పోలీసుశాఖ అండగా ఉంటుందని ఎస్పీ భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీశైలరెడ్డి పాల్గొన్నారు.

క్లబ్ మూసేయాలని వైసీపీ నేత హల్‌చల్

పులివెందుల, మే 5 (ఆంధ్రజ్యోతి): ఓఎమ్‌సీ క్లబ్ మూసేయాలని వైసీపీ నాయకుడు కొమ్మా పరమేశ్వరరెడ్డి సోమవారం హల్‌చల్ చేశారు. లయోలా కళాశాల వద్దనున్న ఓఎమ్‌సీ క్లబ్ భవనం పైకి ఎక్కి క్లబ్ మూసేయకుంటే దూకుతానని మద్యంమత్తులో బెదిరించారు. క్లబ్బులో జూదమాడతున్నారని, మద్యం తాగుతున్నారని, దీనిని వెంటనే మూసేయాలని డిమాండ్ చేశారు. లయోలా కళాశాలకు విద్యార్థులు ఈ దారిలో వెళ్తుంటారని, వారికి ఇబ్బందిగా ఉంటుందన్నారు. రంగప్రవేశం చేసిన పోలీసులు పరమేశ్వర్‌రెడ్డిని కిందికి దించి విచారించారు. తాగిన మత్తులో క్లబ్బును మూసేయాలని డిమాండ్ చేయడంతో పోలీసులు క్లబ్ మూసేయాలంటే విధివిధానాలు ఉంటాయని, అధికారులతో మాట్లాడాలని, అక్కడ నుంచి చెప్పి పంపించారు. దీంతో గొడవ సద్దుమణిగింది.

ముక్కావారిపల్లెలో చోరీ



బాధితులతో మాట్లాడుతున్న ఎస్ఐ మహేష్

ఓబులవారిపల్లె, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్కావారిపల్లెలో శనివారం అర్ధరాత్రి సమయంలో ఓ ఇంటిలో దొంగలు పడి బంగారు దోచుకెళ్లిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్ఐ మహేష్ తెలిపిన వివరాల మేరకు.. ముక్కావారిపల్లెలో కొత్త విజయమ్మ నాలుగు రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి బెంగళూరులో ఉన్న తమ కుమారుడి వద్దకు వెళ్లారు. ఇదే అదనుగా భావించిన దొంగలు వారి ఇంట్లో చొరబడ్డారు. ఇంటి కిటికీ అద్దాలు పగులగొట్టి ఇనుప బీరువాను యంత్రాలతో కత్తిరించారు. బీరువాలో ఉన్న సుమారు 30 తులాల బంగారు నగలు దోచుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు. క్లూస్ టీం ద్వారా దర్యాప్తు చేస్తున్నామని ఆయన వివరించారు.

మిద్దె పైనుండి పడి వ్యక్తి మృతి



మృతి చెందిన రాజశేఖర్

కడప క్రైం, మే 5(ఆంధ్రజ్యోతి): కడప నగరం రామాంజనేయపురంకు చెందిన పెయింటర్ ఓబులాపురం రాజశేఖర్ (50) ఆదివారం సమీప ప్రాంతంలోని ఓ ఇంటికి పెయింటింగ్ వేస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందినట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు. కలసపాడు మండలం చెన్నారెడ్డిపల్లె దళిత కాలనీకి చెందిన రాజశేఖర్ పెయింటింగ్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పిల్లలతో కలిసి కడప రామాంజనేయపురంలో నివాసం ఉంటున్నాడు. ఆదివారం పెయింట్ పని చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు మిద్దెపై నుంచి కాలుజారి కింద పడి మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. మృతుడి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నామని తెలిపారు.


అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



మృతి చెందిన నేపాల్

మదనపల్లె అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందాడు. ఆస్పత్రి అవుట్ పోలీసుల తెలిపిన వివరాల మేరకు రాజస్థాన్‌కు చెందిన ఈర్‌సింగ్, అతని కుమారుడు నేపాల్ (18) కొన్నేళ్లుగా మదనపల్లె పట్టణం ఆర్‌ఆర్ వీధిలో ఫ్యాన్సీస్టోర్ నిర్వహిస్తున్నారు. ఆదివారం షాపు సెలవు కావడంతో నేపాల్ మద్యం సేవించాడు. సోమవారం ఉదయం నుంచి వాంతులు చేసుకుంటుండడంతో సాయంత్రం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రికి వచ్చిన కొద్దిసేపటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య



చిన్నారి మృతదేహం

కలకడ, మే 5 (ఆంధ్రజ్యోతి): భర్తతో గొడవపడి ఓ వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. హైదారాబాద్‌లో మియాపూర్ బొల్లారం ప్రాంతానికి చెందిన మణి మండలంలోని కోన గ్రామంలో వున్న క్వారీలలో రాయి కొట్టడానికి కూలీగా వచ్చాడు. ఎర్రయ్యగారిపల్లిలో ఇల్లు అద్దెకు తీసుకుని తన భార్య చిన్నారి (19)తో కలసి కాపురం ఉంటున్నాడు. ఆదివారం మద్యం సేవించి ఇంటికి వెళ్లడంతో ఇద్దరు గొడవ పడ్డారు. ఈ సోమవారం వేకువజామున మణి నిద్రలేచి పనులకు వెళ్లగా, చిన్నారి ఇంటిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుందని ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

హత్య కేసులో ఏడుగురు అరెస్టు

వేంపల్లె, మే 5(ఆంధ్రజ్యోతి): రాజీవ్‌నగర్ కాలనీలో జరిగిన ఘర్షణలో కత్తి శ్రీనివాసులు తీవ్రంగా గాయపడి కడప రిమ్స్‌లో మృతిచెందిన ఘటనలో హత్య కేసు నమోదైంది. ఈ హత్య కేసులో ఉన్న నిందితులు ఎం.వెంకటేశ్, వి.వెంకటేశ్వర్లు, అంజితో పాటు ఏడుగురిని సోమవారం అరెస్టు చేసినట్లు సీఐ నరసింహులు తెలిపారు. కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించారని, నిందితులను జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

వేంపల్లె పట్టణంలో సీఐ ముమ్మర తనిఖీలు నిర్వహించారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వవద్దని, ఇస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. పలువురు యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

చదువుతోనే విద్యార్థులకు మంచి భవిష్యత్తు

- కలెక్టర్ చెరుకూరి శ్రీధర్
- పదో తరగతిలో టాప్-10 విద్యార్థులకు సన్మానం



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో కలెక్టర్, ఎస్పీ, డీఈవో తదితరులు

కడప ఎడ్యుకేషన్, మే 5 (ఆంధ్రజ్యోతి): చదువుతోనే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని, ప్రణాళికాబద్ధంగా చదివి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆకాంక్షించారు. సోమవారం నగర శివారులోని శిల్పారామంలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల టాప్-10 విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ అశోక్‌కుమార్‌లు హాజరయ్యారు. 2024-25 విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో జిల్లా స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన మొదటి పది మంది విద్యార్థులను కలెక్టర్, ఎస్పీ సన్మానించి మెమెంటోలు అందించారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి ఆత్మీయ విందు భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాణ్యమైన విద్యతో సాధారణ విద్యార్థిని కూడా ఉపాధ్యాయులు విజయవంతమైన స్థాయిలో నిలుపగలరన్నారు. జిల్లాలో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడంలో ఉపాధ్యాయులు ప్రముఖ పాత్ర పోషించారని, ఈ సందర్భంగా వారిని అభినందించారు. జిల్లాలోని సింహాద్రిపురం మండలం రావులకొలను జడ్పీ హైస్కూల్‌కు చెందిన జోషిక పల్లేటి అత్యధికంగా 595 మార్కులు, సిద్దవటం మండలం జడ్పీ హైస్కూల్‌కు చెందిన అతికారి పల్లవి 594, పెండ్లిమర్రి మండలం గంగనపల్లె జడ్పీ హైస్కూల్ నీలం నాగవీరతరుణ్ 593, కాశినాయన మండలానికి చెందిన ఏపీమోడల్ స్కూల్ బండి రామసాయి విగ్నేష్ 593, వేంపల్లె మండలం రామిరెడ్డిపల్లె జడ్పీ హైస్కూల్ విద్యార్థి రుద్ర గంగా జశ్వంత్‌రెడ్డి 592, బద్వేలు మండలానికి చెందిన అతికారి రక్షిత 591, జమ్మలమడుగు మండలం ఎంజేపీఏపీబీసీ డబ్ల్యూఆర్ఎస్ (బాలుర) గంజికుంట వెంకట శివసంతోష్ 591, వేముల మండలానికి చెందిన జడ కార్తీక్ 590, జమ్మలమడుగు మండలానికి చెందిన కొట్టం జువేరియ తహసీన్ 590, తొండూరు మండలానికి చెందిన ఎంజేపీ ఏపీబీసీడబ్ల్యూ రెసిడెన్షియల్ స్కూల్ (బాలికలు) గంజికుంట తన్మయి 589 మార్కులు సాధించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. డీఈఓ షంషుద్దీన్ ప్రసంగించారు. కాగా రామకృష్ణ మిషన్, విద్యార్థుల శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి, జడ్పీ సీఈఓ ఓబుళమ్మ, సర్వశిక్ష అభియాన్ ఏపీసీ నిత్యానందరాజు, ఇతర జిల్లా అధికారులు, డిప్యూటీ డీఈఓలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాయనపల్లె ప్రభుత్వ భూముల పరిశీలన

- భూ ఆక్రమణపై జేసీకి నివేదిక సమర్పించిన తహసీల్దారు




ఆక్రమణ భూములను పరిశీలిస్తున్న జేసీ అదితి సింగ్

కాశినాయన, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాయనపల్లె గ్రామ సమీపంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను సోమవారం జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, బద్వేల్ ఆర్డీవో చంద్రమోహన్‌తో కలిసి పరిశీలించారు. అక్కడ ఉన్న కొండ పొరంబోకు భూములను సమగ్రంగా పరిశీలించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ 128, 129(1), 130, 217 సర్వే నెంబర్లలో ఎంతెంత భూమి ఆక్రమణకు గురైందనన్న విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ భూములు ఆక్రమించుకున్న వారికి ఎక్కడెక్కడ భూములున్నాయి, వారికి నోటీసులు ఇచ్చారా తదితర అంశాలపై ఆరా తీశారు. ఇందులో సర్వే నెంబర్ 128లో 0.28 సెంట్లు, 129(1)లో 82.85 ఎకరాలు, 130లో 83.18 ఎకరాలు, 217లో 128 ఎకరాలను 63 మంది రైతులు ఆక్రమించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. అనంతరం ఈ భూ ఆక్రమణలపై సమగ్ర నివేదికను జేసీకి అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దారు వెంకటసుబ్బయ్య, ఆర్ఐ అమర్‌నాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

12న వైఎస్ షర్మిల రాక

కడప కలెక్టరేట్, మే 5(ఆంధ్రజ్యోతి): పీసీసీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఈనెల 12వ తేదీన కడపకు రానున్నట్లు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎన్‌డీ విజయజ్యోతి తెలిపారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆమె కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తెచ్చేలా కృషి చేయాలన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కడపలో జరిగే సమావేశంలో నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేయనున్నారని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు అఫ్జల్‌ఖాన్, డీసీసీ ఉపాధ్యక్షుడు సిరాజుద్దీన్, ప్రసాద్‌గౌడ్, మామిళ్ల బాబు, సంజయ్ కాంత, తదితరులు పాల్గొన్నారు.

వలసపాలెం వాసి కువైట్‌లో మృతి



గంగాధర్ ఫైల్‌ఫొటో

అట్లూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమలకూరు గ్రామ పంచాయతీ వలసపాలెం గ్రామానికి చెందిన కేతవరం గంగాధర్ (38) కువైట్‌లో పదిరోజుల క్రితం ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు మృతుడి బంధువులు తెలిపారు. గంగాధర్ ఐదు సంవత్సరాల క్రితం బతుకుదెరువు కోసం కువైట్ వెళ్లాడు. అప్పటి నుంచి వస్తూపోతూ ఉండేవాడని బంధువులు తెలిపారు. కువైట్‌లో బిల్డింగు పనులు చేసేవాడని, అతను ఉన్న రూములో తోటి మిత్రులకు వంట చేసి బయటికి వెళ్లివస్తానని చెప్పి బయటకు వెళ్లాడని, పోయినవాడు రాకపోవడంతో పోలీసుల చెకింగ్ లో పట్టుబడి జైల్లో వేశా రేమోనని అనుమానం వ్యక్తం చేశారన్నారు. పదిరోజుల తరువాత ఫర్వానియా ఆసుపత్రి నుండి ఇండియా ఎంబసీకి ఫోను చేసి మృతుడి గుర్తింపు కార్డు ప్రకారం వివరాలు తెలుపగా అట్లూరు పోలీసుస్టేషనుకు సోమవారం ఇండియా ఎంబసీ ఫోను చేశారని బంధువులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులకు ఫోను చేసి విషయం తెల పడంతో మృతి చెందినట్లు డిక్లేర్ అ యింది. మృతదేహం రెండు మూడు రోజుల్లో స్వగ్రామానికి వస్తుందని తెలిపారు. మృతుడికి భార్య సావిత్రమ్మ, కొడుకు, కూతురు ఉన్నారు.

రైతు సమస్యల పరిష్కారం కోసం పాటుపడాలి

- భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు సహదేవరెడ్డి



చెన్నూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులకు ఎలాంటి సమస్యలు వచ్చినా వారి కోసం భారతీయ కిసాన్ సంఘ్ ఎల్లవేళలా పాటుపడాలని సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉమ్మడి సహదేవరెడ్డి అన్నారు. చెన్నూరు ఎంపీఎస్‌ఆర్ కన్వెన్షన్ హాలులో సోమవారం రెండురోజుల పాటు జిల్లాస్థాయి శిక్షణ తరగతుల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా దక్షిణ భారత సంఘటన అధ్యక్షుడు (ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక) దోనూరు రాము హాజరయ్యారు. ఈ సందర్భంగా సహదేవరెడ్డి మాట్లాడుతూ రైతులకు పంటలసాగులో ముఖ్యంగా విద్యుత్, విత్తనాల సమస్య, ఎరువులు వంటి ఎలాంటి సమస్యలు తలెత్తినా బీకేఎస్ ఆధ్వర్యంలో తక్షణం స్పందించి ఆ సమస్య పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. బీకేఎస్ అంటేనే రైతుల అభివృద్ధికి, సంక్షేమానికి మారుపేరు అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కొండబాబు, శ్రీపతిరాజు, మహేశ్వర్‌రెడ్డి, ఆశాకిరణ్, బీకేఎస్ చంద్రశేఖర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, ఎన్.సుబ్బారెడ్డి, జనార్ధనరెడ్డి, కడప, అన్నమయ్య, చిత్తూరు. తిరుపతి, నెల్లూరు, నంద్యాల, కర్నూలు, అనంతపురం సత్యసాయి జిల్లాల కిసాన్ సంఘ నేతలు పాల్గొన్నారు.

నాటు సారా స్వాధీనం

- ఇద్దరు అరెస్టు

ములకలచెరువు, మే 5(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు ప్రొహిబిషన్ ఎక్సైజ్ పరిధిలోని పెద్దమండ్యం మండలంలో సోమవారం దాడులు నిర్వహించి నాటు సారాను స్వాధీనం చేసుకోవడంతో పాటు ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ మాధవి తెలిపారు. మండలంలోని గోఉపోతులపల్లె సమీపంలో నాటు సారా వండుతున్న శ్రీనునాయక్, జయమ్మలను అరెస్టు చేసి వారి నుంచి 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ దాడుల్లో సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా అంకాళమ్మ తిరునాళ్లు


అంకాళమ్మ తల్లి సన్నిధిలో ముక్కా రూపానందరెడ్డి

రైల్వేకోడూరు, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టిగుంటలో సోమవారం అంకాళమ్మ తిరునాళ్లు వైభవంగా జరిగింది. ఉదయాన్నే భక్తులు అమ్మవారికి పొంగళ్లు పెట్టుకున్నారు. మొక్కుబడులు తీర్చుకున్నారు. గంగమ్మతల్లిని వివిధ రకాల పూలతో అలంకరించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ముందస్తు చర్యగా రైల్వేకోడూరు సీఐ కే. హేమసుందరరావు ఆదేశాల మేరకు ఎస్ఐ జీ. నవీన్‌బాబు తమ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. టీడీపీ ఇన్‌చార్జ్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, మహిళా నాయకురాలు ముక్కా వరలక్ష్మి, డీసీఎంఎస్ చైర్మన్ ఎర్రగుండ్ల జయప్రకాష్, శెట్టిగుంట సర్పంచ్ సాలాపక్షి శివశైలజ, కూటమి నాయకులు నాగినేని వెంకటరమణ, ప్రముఖ న్యాయవాది చంద్రశేఖర్ పాల్గొన్నారు.

డీసీఎంఎస్ చైర్మన్‌కు సన్మానం

రైల్వేకోడూరు, మే 5(ఆంధ్రజ్యోతి): నూతనంగా ఎంపికైన డీసీఎంఎస్ చైర్మన్ ఎర్రగుండ్ల జయప్రకాష్‌ను సోమవారం టీడీపీ మహిళా నాయకురాలు ముక్కా వరలక్ష్మి, యువ నాయకుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వేకోడూరు నియోజకవర్గంలో జయప్రకాశ్ పార్టీ కోసం ఎన్నో సేవలు చేశారని, పార్టీ అధికారంలోకి రాగానే ఆయన్ను గుర్తించి పదవి ఇచ్చారన్నారు. చైర్మన్ జయప్రకాష్ మాట్లాడుతూ డీసీఎంఎస్ పదవితో తన సేవలు ప్రజలకు అందిస్తామని తెలిపారు.

ఘనంగా వార్షికోత్సవం

ఓబులవారిపల్లె, మే 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముక్కావారిపల్లె టీటీడీ కల్యాణమండపంలో సమరసత ఫౌండేషన్ సంస్థ వారి సమరసత బాలవికాస్ కేంద్రాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, కుడా చైర్మన్ ముక్కారెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి హాజరయ్యారు. ప్రచార కార్యదర్శి సుబ్బరాయుడు ఆచారి, ప్రచార సభ్యులు, మహిళలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భూకబ్జాలకు పాల్పడితే చర్యలు తప్పవు : ఎస్ఐ

సిద్దవటం, మే 5 (ఆంధ్రజ్యోతి) : భూకబ్జాలకు పాల్పడితే చర్యలు తప్పవని మండల ఎస్ఐ మహమ్మద్‌రఫి హెచ్చరించారు. సోమవారం సిద్దవటం పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ మాట్లాడుతూ ప్రభుత్వ భూములు, డీకేటీ స్థలాలు, పట్టాదారులైన రైతుల భూములు భూకబ్జాలకు పాల్పడితే ల్యాండ్ గ్రాబింగ్ 1982 చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఉప్పరపల్లె, మాధవరం, జయమ్మ కాలనీ, పెద్దపల్లి రెవెన్యూ నుంచి కొంతమంది భూములు, ఇళ్ల స్థలాలు భూకబ్జా చేశారని, ఫిర్యాదులు వస్తున్నాయని, ఎటువంటివారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు.

తెలుగు భాషా సదస్సుకు ఆహ్వానం


గంగనపల్లె వెంకటరమణ

రాజంపేట టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి) : తెలుగు భాషా పట్టాభిషేకం పేరుతో ఈ నెల 20న గురువారం హైదరాబాదులోని త్యాగరాయ గానసభ సభా సమావేశ మందిరంలో జరిగే సదస్సుకు రాజంపేటకు చెందిన తెలుగు అధ్యాపకుడు, కవి, పండితుడు గంగనపల్లె వెంకటరమణ ఆహ్వానం అందుకున్నారు. 'తెలుగు భాషాభివృద్ధి పరిరక్షణ' అనే అంశంపై మాట్లాడనున్నారు.

ప్రహరీ నిర్మాణానికి విరాళం

సుండుపల్లె, మే5(ఆంధ్రజ్యోతి):కురవపల్లిలోని శివాలయం ప్రహరీ నిర్మాణానికి దేవపట్ల సతీశ్‌కుమార్‌రెడ్డి రూ.3,06,648 విరాళం అందజేసినట్లు ఆలయ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భవిష్యత్తులోనూ అభివృద్ధి పనులకు ఆర్థిక సహాయం చేస్తామన్నారు.

సౌమ్యనాథ స్వామి ఆలయంలో అన్నీ సమస్యలే

- ఆలయ మాజీ అధ్యక్షుడు అరిగెల సౌమిత్రి చంద్రనాథ్

నందలూరు, మే 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన సౌమ్యనాథస్వామి ఆలయంపలు సమస్యలతో కొట్టుమిట్టాడుతోందని ఆలయ మాజీ అధ్యక్షుడు అరిగెల సౌమిత్రి చంద్రనాథ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ ఆలయం తిరుమల- తిరుపతి దేవస్థానంలో విలీనం అయిందన్నారు. ఆలయ నిర్వహణ సక్రమంగా లేదని భక్తుల నుంచి ఆరోపణలు వస్తున్నాయన్నారు. ఆలయ ఉత్తర ప్రహరీ కూలిపోతే పట్టించుకునే నాథుడు లేడన్నారు. ఆలయంలో అపరిశుభ్రత తాండవిస్తోందని, విషపురుగులు సంచరిస్తున్నాయని, దీంతో భక్తులు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. ఆలయంలో ఎక్కడి చెత్త అక్కడే ఉండడం వల్ల దుర్గంధం వెదజల్లుతోందన్నారు. ప్రతి శనివారం ఉమ్మడి కడప జిల్లాల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా భక్తులు విశేషంగా తరలివస్తున్నారన్నారు.ఆలయంలో 108 ప్రదక్షిణలు చేస్తే కోరిన కోర్కెలు తీరుతాయనే విశ్వాసం భక్తుల్లో నెలకొందన్నారు. కానీ భక్తులకు సరైన సదుపాయాలు లేవని, స్వామివారి కోనేరులో నీరు పాచిపట్టిందన్నారు. గతంలో ప్రతి శనివారం భక్తులకు అన్న ప్రసాదాలను ఆలయ ప్రాంగణంలోనే అందజేసేవారన్నారు. కానీ నేడు ఆ విధానం లేకపోవడంతో భక్తులు ఆకలితో అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టీటీడీ ఈవో, జేఈవోలు ఒక్కసారి సౌమ్యనాథస్వామి ఆలయాన్ని సందర్శిస్తే వాస్తవ పరిస్థితులు తెలుస్తాయన్నారు. కేంద్ర పురావస్తుశాఖ, తిరుమల- తిరుపతి దేవస్థానం సమన్వయంతో ఆలయ అభివృద్ధికి, అన్న ప్రసాద పంపిణీ విషయంలో ఒక నిర్ణయం తీసుకోవాలని కోరారు.


అపరిశుభ్రంగా ఉన్న ఆలయ కోనేరును చూపుతున్న మాజీ చైర్మన్ సౌమిత్రి చంద్రనాథ్

సమస్యలు పరిష్కరించాలని వినతి


ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

రాయచోటిటౌన్, మే5(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల భద్రత 2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని, మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ లీవులను ఇప్పించాలని కోరారు. సిబ్బంది కొరత తీర్చాలని, లీవ్ పొజిషన్‌ను మెరుగుపర్చాలని, కొత్త ఉద్యోగాలు కల్పించాలని, కొత్త బస్సులు కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. మెకానిక్‌లపై పనిభారం తగ్గించాలని, డ్రైవర్లకు లింక్ డ్యూటీలు ఎత్తేయాలని, నైట్ అవుట్ అలవెన్సులను పెంచిన విధంగా అమలు చేయాలని, ప్రమోషన్‌లను ఇవ్వాలని, ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని కొనసాగించాలని, డబుల్ డ్యూటీ అమౌంటల్‌ను పెంచాలని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ మేరకు 73 రోజుల నుంచి నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తున్నా యాజమాన్యం పట్టించుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా ప్రెసిడెంట్ ఎంఎస్ రావు, రీజనల్ వైస్ ప్రెసిడెంట్ రామాంజులు, రీజనల్ నాయకులు ఎంఎస్ ప్రసాద్, డిపో నాయకులు ఆర్‌వీ గోపాల్, డీఎస్ వాసులు, డీవీ సుబ్బయ్య తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమస్యలపై తహసీల్దారుకు వినతి

రాజంపేట టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీలో సమస్యలపై రాజంపేట తహసీల్దారు పీర్‌మున్నీకి సోమవారం నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 33 డిమాండ్లపై ఆర్టీసీ యాజమాన్యానికి వినతిపత్రం అందజేసినా నేటికీ ఒక సమస్య కూడా పరిష్కారం కాలేదన్నారు. రాజంపేట తాలుకా ఏపీజేఏసీ చైర్మన్ ఎస్వీ రమణ, రాజంపేట డిపో కార్యదర్శి రమణ, డిపో అధ్యక్షుడు శివయ్య, కన్వీనర్ కేహెచ్ ప్రసాద్, జీబీ రమణ, కేజీ ప్రసాద్, జయశంకర్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి

చిన్నమండెం, మే5(ఆంధ్రజ్యోతి): తాగునీటి సమస్య లేకుండా చూడాలని సర్వసభ్య సమావేశంలో సభ్యులు తీర్మానించారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ సుధామాధురి అధ్యక్షతన సోమవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు మాట్లాడుతూ ఎండాకాలం అయినందున గ్రామాల్లో మంచినీటి సమస్య లేకుండా చూడాలని కోరడంతో ఆ మేరకు అందరూ తీర్మానించారు. అవసరమైతే ట్యాంకర్లను ఉపయోగించి నీటి సమస్య తీర్చాలన్నారు. అలాగే రెవెన్యూ, వైద్యం, అంగన్వాడీ, పశుసంవర్థక శాఖ, ఎలక్ట్రిసిటీ రంగాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలతో పాటు ఎంపీడీవో శేఖర్‌నాయక్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రసూతి సెలవుల పెంపుపై హర్షం

రామాపురం, మే5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రసూతి సెలవులను 180 రోజులకు (ఆరు నెలలకు) పెంచుతూ జీవో విడుదలపై తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం అన్నమయ్య జిల్లా కన్వీనర్ వీరాంజనేయులు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంజీవరెడ్డి, రామచంద్ర హర్షం తెలిపారు. ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్నా ప్రసూతి సెలవులకు అర్హత ఇస్తూ జీవో నెంబర్ 21 విడుదల చేయడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు.

ప్రపంచ గమ్యాన్ని మార్చిన గొప్ప సిద్ధాంత కర్త కార్ల్ మార్క్స్

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు


మార్క్స్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఐటీయూ నేతలు

రాయచోటిటౌన్, మే5(ఆంధ్రజ్యోతి): ప్రపంచ గమనాన్ని మార్చిన గొప్ప తత్వవేత్త కార్ల్ మార్క్స్ అని సీఐటీయూ నాయకులు పేర్కొన్నారు. మార్క్స్ 207వ జయంతిని పురస్కరించుకుని సోమవారం సీఐటీయూ కార్యాలయంలో మార్క్స్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్ల్ మార్క్స్ 1818 మే 5న జర్మనీలోని ట్రియర్ పట్టణంలో ఓ మధ్య తరగతి కుటుంబంలో జన్మించారని, మార్క్స్ జర్మన్ శాస్త్రవేత్త, తత్వవేత్త, ఆర్థికవేత్త, సామాజికవేత్త, పాత్రికేయుడు, సోషలిస్టు విప్లవకారుడని గుర్తు చేశారు. మార్క్స్ అనేక రచనలను చేశాడని గుర్తు చేవారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఏవీ రమణ, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బీవీ రమణ, పట్టణ అధ్యక్షులు, కార్యదర్శులు చెన్నయ్య, రాంబాబు, శివ పాల్గొన్నారు.

సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలను వినియోగించండి

వీరబల్లి, మే5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న వ్యవసాయ యంత్ర పరికరాలను రైతులు వినియోగించుకోవాలని టీడీపీ అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు పేర్కొన్నారు. స్థానిక మండల వ్యవసాయ కార్యాలయం వద్ద సోమవారం సబ్సిడీపై వచ్చిన రోటోవేటర్లను కూటమి నేతలు, వ్యవశాయ శాఖ అధికారులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సులభతరంగా ఆధునిక వ్యవసాయ పద్దతుల్లో అధిక దిగుబడిని సాధించేందుకు ప్రభుత్వం ఎన్నో ప్రోత్సహకాలను అందిస్తుందన్నారు. సబ్సిడీపై పరికరాలతో పాటు విత్తనాలు, ఎరువులను అందించి తోడ్పాటు అందించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాంమోహన్‌రెడ్డి, బీజేపీ నాయకులు నరేంద్రగౌడ్, జనసేన కన్వీనర్ వెంకటేశ్, సర్పంచు నాగార్జు నాచారి, టీడీపీ నాయకులు నేతి రమేశ్‌బాబు, చెన్నక్రిష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

మామిడి రైతులకు బీమా అందించాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

రాయచోటి(కలెక్టరేట్), మే5(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా నష్టపోయిన మామిడి రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఇన్సూరెన్స్ అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి ఆధ్వర్యంలో రైతులు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి కలెక్టర్ శ్రీధర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మామిడి పంట మూడు సంవత్సరాల నుంచి అరకొర రావడం, వచ్చిన పంట కూడా చేతికి అందకుండా అకాల వర్షాలతో గాలి, వానలతో నేలపాలవడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లు తోందన్నారు. దెబ్బతిన్న మామిడి తోటలను అధికార పార్టీ నాయకులు కానీ, హార్టికల్చర్ అధికారులు పరిశీలించకపోవడం పట్ల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు.

ఈ సంవత్సరం మామిడి తోటల్లో డిసెంబర్‌లో పూత రావాల్సి ఉండగా ఫిబ్రవరి మొదటి వారంలో తోటలన్నీ విరగ పూశాయన్నారు. దీతో రైతులు ఈసారి కాపు బలంగా వస్తుందని ఆశ పడ్డారన్నారు. అయితే పది రోజులకే మామిడి పూత పూర్తిగా రాలిపోయిందన్నారు. ఈ పరిస్థితులను తట్టుకోవాలంటే రైతులకు బీమా తప్పనిసరి అన్నారు. రైతు సంఘం నాయకులు హరినాథనాయుడు, బాలక్రిష్ణారెడ్డి, కేవీ రమణ పాల్గొన్నారు.

జీవో నెంబర్ 77ను రద్దు చేయకుండా ఐసెట్ నిర్వహిస్తే అడ్డుకుంటాం: ఏబీవీపీ

రాయచోటిటౌన్, మే5(ఆంధ్రజ్యోతి): పీజీ చదవాలనుకునే పేద విద్యార్థులకు గుదిబండలా మారిన జీవో 77ను రద్దు చేయకుండా ఐసెట్‌ను నిర్వహిస్తే అడ్డుకుంటామని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ జేపీ నాగిరెడ్డి హెచ్చరించారు. సోమవారం ఆయన ఏబీవీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ యువగళం పాదయాత్రలో మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తానే జీవో నెంబర్ 77ను రద్దు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఊసే ఎత్తడం లేదని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

- రాష్ట్ర వాల్మీకి యూత్ వింగ్ అధ్యక్షుడు బండి వెంకటసాయి

గాలివీడు, మే5(ఆంధ్రజ్యోతి): వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఆర్‌వీఎస్ఎస్ రాష్ట్ర యూత్‌వింగ్ అధ్యక్షుడు బండి వెంకటసాయి డిమాండ్ చేశారు. సోమవారం గాలివీడు మండలంలోని పక్కీరారెడ్డిగారిపల్లె, బురుజుపల్లి-2, గోరాన్ చెరువు, గుండ్లచెరువు, తూముకుంట, ప్రకాశ్‌నగర్‌కాలనీ గ్రామాల్లో ఆర్‌వీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బంగారు కృష్ణమూర్తి ఆదేశాల మేరకు పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019లో కర్నూల్ మహాసభలో వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేరుస్తామన్న ప్రధాన మంత్రి హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయల విషయంలోర ఆజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15, 341, 342, 29(డీ)లు అమలు కావడం లేదని, రాజ్యాంగ ఉల్లంఘటన జరిగిందని ప్రధాని చొరవతో తమ సమస్యను పరిష్కరించాలని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు బండి సాయినాథ్, ఆర్‌వీఎస్ఎస్ గాలివీడు యూత్ ప్రధాన కార్యదర్శి ముండ్ల నరసింహులు, జనరల్ సెక్రటరీ సాయిబోధ, ఆంజనేయులు, రెడ్డికిశోర్, బాలాజీ, పావనీ, రమాదేవి, లలిత, పండు, హిమబిందు, భవానీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సీళ్లు, సంతకాలకు భద్రత కరువా...?

- బోగస్ డీఫారాలకు చిట్వేలి రెవెన్యూ అధికారుల వత్తాసు

చిట్వేలి, మే 5 (ఆంధ్రజ్యోతి) : చిట్వేలి మండలంలో ప్రభుత్వ సీళ్లు, సంతకాలకే భద్రత కరవైందంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి. పేదలకు చెందాల్సిన భూమిని కొందరు అగ్రవర్ణాలకు చెందినవారు బోగస్ డీఫారాలు సృష్టించారని బాధితులు సోమవారం విలేకరుల సమావేశంలో ఆరోపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని సి.కందులవారిపల్లె పంచాయతీ తుమ్మచెట్లపల్లె, రంపావారిపల్లె దళితవాడ సమీపాన తాము కొత్త గ్రామాన్ని నిర్మించుకోవాలనుకుంటుండగా తుమ్మచెట్లపల్లె అగ్రవర్ణానికి చెందిన తుంగా సుబ్బరాయుడు అనే వ్యక్తి అడ్డుపడ్డారన్నారన్నారు. సర్వేనంబరు 877/బి10లోని 1.90 ఎకరాలు, సర్వేనంబరు 887/బి 11లోని 2 ఎకరాలు కలిపి తాము దళితవాడను నిర్మించుకోవాలనుకున్న సమయంలో ఆ భూమికి నకిలీ పత్రాలు సృష్టించి అడ్డు తగిలాడన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు చిట్వేలి తహసీల్దారు విచారించి అది ప్రభుత్వ భూమి తేల్చివేశారన్నారు. డీకేటీ నంబరు 30/98లో గతంలో ప్రభుత్వం బొంగటావుల యానాదయ్య కుమార్తె బొంగటావుల రత్నమ్మకు డీకేటీ పట్టా ఇచ్చి ఉన్నారని, తుంగా సుబ్బరాయుడు కూడా తన భార్య తుంగా కాంతమ్మ పేరుతో 30/98 అని వేసుకుని నకిలీ పట్టాలు సృష్టించారన్నారు.


మాట్లాడుతున్న బాధితులు

హైకోర్టు తేల్చిన తర్వాతే చర్యలు : తహసీల్దార్

దళితులు ఆరోపిస్తున్న భూమిపై తుంగా కాంతమ్మ హైకోర్టులో సవాల్ చేసిందని, తీర్పు వచ్చేవరకు తామేమీ చర్యలు తీసుకోలేమని చిట్వేలి తహసీల్దారు మోహనకృష్ణ అన్నారు. హైకోర్టులో ఉన్న సమస్యను తాము పరిష్కరించలేమన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- మంత్రి రాంప్రసాద్‌రెడ్డి


ప్రజల సమస్యలు వింటున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, మే5(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించి పేదరికం లేని సమాజాన్ని నిర్మించేందుకు విశేష కృషి చేస్తున్నారని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం చిన్నమండెం మండలం బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసంలో మంత్రి ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో పేదలకు సంక్షేమ పథకాలు అందక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనే వారని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సంక్షేమ పథకాలు విరివిగా అందిస్తున్నామన్నారు. త్వరలో నూతన పింఛన్లు, ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. ప్రభుత్వ పథకాలను పేదలందరూ సద్వినియోగం చేసుకొని ఆర్థిక అభివృద్ధి చెందాలన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

ప్రజలకు మెరుగైన సేవలందించాలని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం కొత్తపల్లిలో సచివాలయ సిబ్బంది మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సచివాలయానికి వచ్చే ప్రజల సమస్యలకు ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలన్నారు.

మినీ బ్రిడ్జి నిర్మాణానికి భూమిపూజ

మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మల్లూరు కస్పాలో మినీ బ్రిడ్జి నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ప్రజలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా వాటిని అక్కడికక్కడే పరిష్కరించారు.

పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్

రాయచోటిటౌన్, మే5(ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరంలాంటిదని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం మంత్రి రాయచోటి పట్టణంలోని స్టేట్ గెస్ట్ హౌస్‌లో 43 మందికి గాను రూ.43 లక్షల 72 వేల 853 సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్వోసీ పత్రాలను అందజేశారు. ప్రజల సంక్షేమం గురించి ఆలోచించే నారా చంద్రబాబునాయుడు కలకాలం ముఖ్యమంత్రిగా ఉండాలని ఆకాంక్షించారు.

రేషన్ బియ్యం పట్టివేత


బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శ్రీనివాసులు

రైల్వేకోడూరు,మే 5(ఆంధ్రజ్యోతి): అరక్కోణం రైలులో సోమవారం అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు రైల్వేకోడూరు రెవెన్యూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరక్కోణం రైలులో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారని సమాచారం అందగానే రైల్వేకోడూరు వీఆర్‌వో ఈశ్వరయ్య, రైల్వే పోలీస్ సాయంతో పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న 125 కిలోల బియ్యాన్ని గోడౌన్‌కు తరలించినట్లు తెలిపారు.

వేసవిలో ప్రబలే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో డాక్టర్ ఉషశ్రీ


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

నందలూరు, మే 5 (ఆంధ్రజ్యోతి):వేసవి కాలంలో ప్రబలే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ ఉషశ్రీ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కుందానెల్లూరు గ్రామంలో స్పెషలిస్టు డాక్టర్లచే నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని డీఎంహెచ్‌వో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వ్యాధులు ప్రబలకుండా ఎన్ఎంలు, ఆశాల ద్వారా ఇంటింటికి తిరిగి లార్వా సర్వే నిర్వహించారు. ఏపీడీ వెంకటేశ్వర్లు పైపులైనులో లీకేజీలను గమనించి ఆర్‌డబ్ల్యూఎస్ వారికి తెలిపారు. తాగునీటి నమూనాను పరిశీలనకు పంపించారు. అలాగే జిల్లా ప్రజా ఆరోగ్య ప్రయోగశాల నుంచి మైక్రోబయాలజిస్టు ఉమాపతి ద్వారా రక్త నమూనాలు సేకరించి మలేరియా, టైఫాయిడ్, సీఆర్‌పీ, సీబీటీపీ, డెంగ్యూ, ఆర్‌ఏ ఫ్యాక్టర్, చికున్‌గున్యా తదితర పరీక్షలకు సంబంధించి నమూనాలను మదనపల్లెకు పంపించారు. అనంతరం ప్రజలకు చేతుల శుభ్రత, ఎండతీవ్రత, డెంగ్యూ, ఫ్రైడే డ్రైడేపై అవగాహన కల్పించారు. రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రి జనరల్ ఫిజిషియన్ డాక్టర్ గిరిధర్, డాక్టర్ శరత్‌కమల్, డాక్టర్ కార్తీక్ విశ్వనాథ్, సీహెచ్‌వో నారాయణ, సబ్‌యూనిట్ అధికారి ఎస్ఎస్ దాస్, జిల్లా మలేరియా ల్యాబ్ టెక్నీషియన్ శివ పాల్గొన్నారు.


20న సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

రాజంపేట, మే 5 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 20 చేపడుతున్న దేశవ్యాప్త సమ్మెకు హాజరవుతున్నామని తెలుపుతూ సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులకు ఎంఐ నోటీసులు అందజేశారు. ఇందులో భాగంగా మున్సిపల్ కార్మికులు, సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు పీవీ రమణ, లక్ష్మీదేవి, ఓబయ్య, ప్రసాద్, ఎంవీ రమణ మాట్లాడుతూ లేబర్ కోడ్ రద్దు చేసి కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వరంగ సంస్థలను పరిరక్షించాలన్నారు. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్‌లు అమలయ్యేలా చూడాలన్నారు. ఆఫ్‌కాస్ట్ ప్రైవేటు ఏజెన్సీలకు అనుమతులు ఇవ్వవద్దని మున్సిపల్ పారిశుధ్య ఇంజనీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, ఇంజనీరింగ్ ఎస్ఎంఆర్ బదిలీ కోవిడ్ క్లబ్ డ్రైవర్లను జీవో 36 ప్రకారం జీతాలు ఇవ్వాలన్నారు. డెత్‌సిక్ ఆఫ్ కాల్స్ ద్వారా పదవి విరమణ చేసిన కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. పదవి విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలన్నారు.

డీకేటీ పొలంలో యంత్రంతో పనులు


కనుమలోపల్లె వద్ద డీకేటీ పొలంలో ఎక్స్‌కవేటర్‌తో పనులు చేస్తున్న దృశ్యం

సిద్దవటం, మే 5 (ఆంధ్రజ్యోతి) : కడప చెన్నై జాతీయ రహదారి రోడ్డు ఆనుకుని కామాక్షమ్మ గుడి ఎదురుగా కడపకు చెందిన ఓ వ్యక్తి డీకేటీ రైతు పొలంలో గ్రావెల్ తరలించి జేసీబీతో చదును చేసి డీకేటీ పొలం చుట్టూ కట్టడాలు నిర్మించడానికి యంత్రాలతో పనులు చేస్తున్నా నిలుపుదల చేయడంలో రెవెన్యూ యంత్రాంగం ఏమాత్రం చర్యలు చేపట్టలేదు. మండలంలోని కనుమలోపల్లె రెవెన్యూ పొలం సర్వేనంబరు 20 నేషనల్ హైవేరోడ్డు ఆనుకుని కామాక్షమ్మ గుడి ఎదురుగా 40 సెంట్లు డీకేటీ పొలంలో సోమవారం కడపకు చెందిన వ్యక్తి జేసీబీతో పనులు చేస్తున్నా ఏమాత్రం అధికారులు పనులు నిలుపుదల చేయలేదని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఈ విషయమై ఇన్‌చార్జి తహసీల్దారు మాధవీలతను వివరణ కోరగా విచారిస్తామన్నారు.

పులివెందుల వద్ద నిర్మిస్తున్న మెడికల్ కళాశాల పనులు ఏడాది కాలంగా ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. దాదాపు రూ.500కోట్లతో ప్రారంభించి రూ.380కోట్లు ఖర్చుచేసినా అసంపూర్తి పనుల కారణంగా ఇంకా వినియోగంలోకి రాని దుస్థితి. మరో రూ.120కోట్లు ఖర్చుచేస్తే మెడికల్ కళాశాల, ఆసుపత్రి వినియోగంలోకి రానున్నాయి. కానీ ఎప్పటికి ఈ పనులు పూర్తవుతాయో అన్న ప్రశ్న ప్రశ్నగానే మిగిలే అవకాశం కనిపిస్తోంది.


70శాతం పనులు పూర్తయిన ఐపీ భవనం

ఏడాదిగా ఎక్కడికక్కడే..

● నిలిచిపోయిన మెడికల్ కళాశాల పనులు ● రూ.380కోట్లు ఖర్చు చేసినా అసంపూర్తిగానే

పులివెందుల, మే 5 (ఆంధ్రజ్యోతి): పులివెందుల ప్రాంత ప్రజల కోసం అప్పటి రాష్ట్ర ప్రభుత్వం రూ.500కోట్లతో దాదాపు 25ఎకరాల్లో మెడికల్ కళాశాలతో పాటు అధునాతన ఆసుపత్రిని నిర్మించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 2022లో ఈ మెడికల్ కళాశాల పనులు ప్రారంభించారు. ఈ పనులను ఓ ప్రైవేట్ సంస్థకు అప్పగించారు. పనులు ఆది నుంచి కూడా వేగంగా సాగలేదని చెప్పాలి. పనులు ప్రారంభమై టెండర్ల దశలో, బిల్లులు కాక దాదాపు ఆరు నెలల పాటు పనులు ఆగిన పరిస్థితి ఇక్కడ నెలకొంది. సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సొంత నియోజకవర్గంలో మెడికల్ కళాశాల పనులు ఆగిపోవడం అందరిని ఆశ్చర్యానికి గురిచేసింది. నిధులు విడుదల కాకపోవడంతో పనులు ఆగిపోయాయని విమర్శలు రావడంతో మళ్లీ పనులు ప్రారంభించారు. పనులు ప్రారంభించినప్పటికీ నిర్దేశించిన పనులు పూర్తికాలేదు. 2024 ఎన్నికలు దగ్గరపడుతుండడంతో ఆసుపత్రిని ప్రారంభించింది. మెడికల్ కళాశాలకు సంబంధించిన భవనాల నిర్మాణాలు పూర్తికాలేదు. కానీ ఆసుపత్రికి సంబంధించిన భవనాలు పూర్తయ్యాయని అప్పటి ముఖ్యమంత్రి చేత ప్రారంభించారు. ఆసుపత్రి భవనాలు కూడా పూర్తిస్థాయిలో నిర్మాణం కాలేదు. ఓపీ, ఐపీ, అత్యవసర సేవల విభాగాల భవనాలు కూడా పూర్తికాకపోవడంతో కాంట్రాక్టు సంస్థ దగ్గర నుంచి ప్రభుత్వం స్వాధీనం చేసుకోలేదు.

పూర్తి కాకుండానే ప్రారంభం

ఆసుపత్రికి సంబంధించిన ఓపీ విభాగం, ఐపీ విభాగం, అత్యవసర సేవల విభాగం ఇలా మూడు విభాగాలలో కూడా పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఓపీ విభాగానికి సంబంధించి 80శాతం, ఐపీ విభాగానికి సంబంధించి 70శాతం, అత్యవసర సేవల విభాగానికి సంబంధించి 40శాతం పనులు పూర్తి అయినట్లు సమాచారం. మెడికల్ కళాశాల పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. మెడికల్ కళాశాల భవనాలు అసంపూర్తిగానే ఉన్నాయి. కేవలం ఒక అంతస్తు స్లాబ్ పూర్తిచేశారు. మిగిలినదంతా పిల్లర్ల దశలోనే ఉంది. అలాగే విద్యార్థుల హాస్టల్, లైబ్రరీ భవనాలు కూడా పూర్తికాలేదు. ల్యాబ్‌ది అదే పరిస్థితి. ఇలా అన్ని పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. ఇప్పటికి దాదాపు రూ.500కోట్ల పనులకు గాను రూ.380కోట్ల పనులు పూర్తయినట్లు ఓ అధికారి వెల్లడించారు. నిర్మాణ పనులు చేపట్టిన సంస్థ ప్రభుత్వం నుంచి రూ.10 నుంచి రూ.20కోట్ల దాకా బిల్లులు రావాల్సి ఉందన్నారు.

ఏడాదిగా ముందుకు సాగని పనులు

2024 ఎన్నికలకు దాదాపు రెండు నెలల ముందు నుంచే పనులు నత్తనడకన సాగాయి. ఎన్నికల సమయానికి పనులు పూర్తిగా ఆగిపోయాయి. ఎన్నికలు అయిపోయి ఏడాది గడిచింది. అంటే ఏడాది కాలంగా కూటమి ప్రభుత్వం ఈ పనులపై ఎటువంటి చర్య తీసుకోలేదు. ప్రస్తుతానికి ఈ భవనాల్లో ఓపీ, ఎమర్జెన్సీ విభాగాల్లో ఆసుపత్రి నడుపుతున్నారు. కేవలం ఆసుపత్రి నిర్వహణ చేపట్టడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. మరో రూ.100 నుంచి రూ.120 కోట్లు ఖర్చుచేస్తే మెడికల్ కళాశాల ప్రారంభమవుతుంది. పులివెందుల ప్రాంతంతో పాటు చుట్టుపక్కల ప్రజలకు అధునాతన వైద్యం అందనుంది. ఏదిఏమైన పులివెందుల మెడికల్ కళాశాల పనులు ఏడాదిగా ఎక్కడి పనులు అక్కడే అన్నట్లున్నాయి.


పూర్తికాని హాస్టల్ భవనాలు


పిల్లర్ల దశలోనే మెడికల్ కళాశాల భవనం

ముస్లిం మైనార్టీల పట్ల వైసీపీ మొసలి కన్నీరు

● వక్ఫ్ సవరణ చట్టంపై డబుల్ గేమ్ : తులసిరెడ్డి

వేంపల్లె, మే 5 (ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనార్టీల పట్ల వైసీపీది మొసలి కన్నీరు, వక్ఫ్ సవరణచట్టంపై డబుల్ గేమ్ ఆడుతోందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. వేంపల్లెలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ లోక్‌సభలో వక్ఫ్ సవరణ చట్టానికి వైసీపీ వ్యతిరేకంగా ఓటు వేసిందని, కానీ రాజ్యసభలో అనుకూలంగా ఓటువేసి డబుల్‌గేమ్ ఆడిందన్నారు. పౌరసత్వ సవరణచట్టానికి కూడా బీజేపీకి అనుకూలంగా వైసీపీ ఓటు వేసిందన్నారు. బీజేపీ చేతిలో టీడీపీ, జనసేన, వైసీపీలు కీలుబొమ్మలన్నారు. అలాగే బీజేపీపుట్టక ముందే హిందూఅనే పదం వాడుకలో ఉందన్నారు. 1915లో హిందు మహాసభ, 1925లో ఆర్‌ఎస్‌ఎస్, 1951లో భారతీయ జనసంఘ్, 1964లో విశ్వహిందూ పరిషత్, 1980లో బీజేపీ పుట్టిందన్నారు. బీజేపీది నకిలీ జాతీయ వాదమని విమర్శించారు.

ఉరి వేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

జమ్మలమడుగు, మే 5 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలం దేవగుడి గ్రామంలో ఆదివారం ఇంటి వద్ద నుంచి వెళ్లి గూడెంచెరువు మాబు (72) అనే వృద్ధుడు విద్యుత్తు స్తంభానికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు.. గూడెంచెరువు మాబు ఆదివారం ఇంటి వద్ద నుంచి కనపడకుండా వెళ్లిపోయాడు. సోమవారం రాబడిన సమాచారం మేరకు దేవగుడి, సలివెందుల గ్రామాలకు వెళ్లినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. ఆత్మహత్యకు పాల్పడిన వృద్ధుడి భార్య గత కొన్ని నెలల క్రితం మృతి చెందింది. అప్పటి నుంచి ఆయన ఆరోగ్యం సహకరించక అనారోగ్యానికి గురయ్యాడు. జీవితంపై విరక్తి చెంది గ్రామం శివార్లలో ఉన్న తన పొలంలోకి వెళ్లి విద్యుత్తు స్తంభానికి పంచెతో ఉరి వేసుకున్నాడు. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు మహబూబ్‌బాష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

క్లబ్ మూసేయాలని వైసీపీ నేత హల్‌చల్

పులివెందుల, మే 5 (ఆంధ్రజ్యోతి): ఓఎమ్‌సీ క్లబ్ మూసేయాలని వైసీపీ నాయకుడు కొమ్మా పరమేశ్వరరెడ్డి సోమవారం హల్‌చల్ చేశారు. లయోలా కళాశాల వద్దనున్న ఓఎమ్‌సీ క్లబ్ భవనం పైకి ఎక్కి, క్లబ్ మూసేయకుంటే దూకుతానని మద్యంమత్తులో బెదిరించారు. క్లబ్బులో జూదమాడతున్నారని, మద్యం తాగుతున్నారని, దీనిని వెంటనే మూసేయాలని డిమాండ్ చేశారు. లయోలా కళాశాలకు విద్యార్థులు ఈ దారిలో వెళ్తుంటారని, వారికి ఇబ్బందిగా ఉంటుందన్నారు. రంగప్రవేశం చేసిన పోలీసులు పరమేశ్వర్‌రెడ్డిని కిందికి దించి విచారించారు. తాగిన మత్తులో క్లబ్బును మూసేయాలని డిమాండ్ చేయడంతో పోలీసులు క్లబ్ మూసేయాలంటే విధివిధానాలు ఉంటాయని, అధికారులతో మాట్లాడాలని, అక్కడ నుంచి చెప్పి పంపించారు. దీంతో గొడవ సద్దుమణిగింది.

విద్యుదాఘాతంతో వ్యక్తికి గాయాలు

మదనపల్లె అర్బన్ మే 5 (ఆంధ్రజ్యోతి): రైల్వే విద్యుత్ లైన్ పట్టుకోవడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు కురబలకోట మండలం, ఎర్రగానిపల్లె గ్రామం, సింగనొడ్డిపల్లెకు చెందిన కోటకొండ చంద్రశేఖర్(45) వ్యవసాయదారు. అతని తండ్రి రైల్వేలో పని చేసేవాడు. సోమవారం తన తండ్రి గుర్తుకురావడంతో సీటీఎం సమీపంలో రైల్వే విద్యుత్‌లైన్ పట్టుకున్నాడు. దీంతో విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. శరీరం అంతా కాలిపోయింది. వెంటనే కుటుంబసభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నాటు సారా స్వాధీనం.. ఇద్దరు అరెస్టు

ములకలచెరువు, మే 5(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు ప్రొహిబిషన్ ఎక్సైజ్ పరిధి లోని పెద్దమండ్యం మండలంలో సోమవారం దాడులు నిర్వహించి నాటు సారాను స్వాధీనం చేసుకోవడంతో పాటు ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ మాధవి తెలిపారు. మండలంలోని గోఆపోతులపల్లె సమీపంలో నాటు సారా వండుతున్న శ్రీనునాయక్, జయమ్మలను అరెస్టు చేసి వారి నుంచి 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దాడుల్లో సిబ్బంది పాల్గొన్నారు.

ముక్కావారిపల్లెలో చోరీ


బాధితులతో మాట్లాడుతున్న ఎస్ఐ మహేష్

ఓబులవారిపల్లె, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్కావారిపల్లెలో శనివారం అర్ధరాత్రి సమయంలో ఓ ఇంటిలో దొంగలు పడి బంగారు దోచుకెళ్లిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్‌ఐ మహేష్ తెలిపిన వివరాల మేరకు.. ముక్కావారిపల్లెలో కొత్త విజయమ్మ నాలుగు రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి బెంగళూరులో ఉన్న తమ కుమారుడి వద్దకు వెళ్లారు. ఇదే అదనుగా భావించిన దొంగలు వారి ఇంట్లో చొరబడ్డారు. ఇంటి కిటికీ అద్దాలు పగులగొట్టి ఇనుప బీరువాను యంత్రాలతో కత్తిరించారు. బీరువాలో ఉన్న సుమారు 30 తులాల బంగారు నగలు దోచుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహేష్ తెలిపారు. క్లూస్ టీం ద్వారా దర్యాప్తు చేస్తున్నామని ఆయన వివరించారు.

మిద్దె పైనుండి పడి వ్యక్తి మృతి


మృతి చెందిన రాజశేఖర్

కడప క్రైం, మే 5(ఆంధ్రజ్యోతి): కడప నగరం రామాంజనేయపురంకు చెందిన పెయింటర్ ఓబులాపురం రాజశేఖర్ (50) ఆదివారం సమీప ప్రాంతంలోని ఓ ఇంటికి పెయింటింగ్ వేస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందినట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు. కలసపాడు మండలం చెన్నారెడ్డిపల్లె దళిత కాలనీకి చెందిన రాజశేఖర్ పెయింటింగ్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పిల్లలతో కలిసి కడప రామాంజనేయపురంలో నివాసం ఉంటున్నాడు. ఆదివారం పెయింట్ పని చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు మిద్దెపై నుంచి కాలుజారి కింద పడి మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. మృతుడి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నామని తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


మృతి చెందిన నేపాల్

మదనపల్లె అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందాడు. ఆస్పత్రి అవుట్ పోలీసుల తెలిపిన వివరాల మేరకు రాజస్థాన్‌కు చెందిన ఈర్‌సింగ్, అతని కుమారుడు నేపాల్ (18) కొన్నేళ్లుగా మదనపల్లె పట్టణం ఆర్‌ఆర్ వీధిలో ఫ్యాన్సీస్టోర్ నిర్వహిస్తున్నారు. ఆదివారం షాపు సెలవు కావడంతో నేపాల్ మద్యం సేవించాడు. సోమవారం ఉదయం నుంచి వాంతులు చేసుకుంటుండడంతో సాయంత్రం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రికి వచ్చిన కొద్దిసేపటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య


చిన్నారి మృతదేహం

కలకడ, మే 5 (ఆంధ్రజ్యోతి): భర్తతో గొడవపడి ఓ వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. హైదారాబాద్‌లో మియాపూర్ బొల్లారం ప్రాంతానికి చెందిన మణి మండలంలోని కోన గ్రామంలో వున్న క్వారీలలో రాయి కొట్టడానికి కూలీగా వచ్చాడు. ఎర్రయ్యగారిపల్లిలో ఇల్లు అద్దెకు తీసుకుని తన భార్య చిన్నారి (19)తో కలిసి కాపురం ఉంటున్నాడు. ఆదివారం మద్యం సేవించి ఇంటికి వెళ్లడంతో ఇద్దరు గొడవ పడ్డారు. ఈ సోమవారం వేకువజామున మణి నిద్రలేచి పనులకు వెళ్లగా, చిన్నారి ఇంటిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుందని ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

హత్య కేసులో ఏడుగురు అరెస్టు

వేంపల్లె, మే 5(ఆంధ్రజ్యోతి): రాజీవ్‌నగర్ కాలనీలో జరిగిన ఘర్షణలో కత్తి శ్రీనివాసులు తీవ్రంగా గాయపడి కడప రిమ్స్‌లో మృతిచెందిన ఘటనలో హత్య కేసు నమోదైంది. ఈ హత్య కేసులో ఉన్న నిందితులు ఎం.వెంకటేష్, వి.వెంకటేశ్వర్లు, అంజితో పాటు ఏడుగురిని సోమవారం అరెస్టు చేసినట్లు సీఐ నరసింహులు తెలిపారు. కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించారని, నిందితులను జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

వేంపల్లె పట్టణంలో సీఐ ముమ్మర వాహన తనిఖీలు నిర్వహించారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వవద్దని, ఇస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. పలువురు యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

చదువుతోనే విద్యార్థులకు మంచి భవిష్యత్తు

● కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ● పదో తరగతిలో టాప్-10 విద్యార్థులకు సన్మానం



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో కలెక్టర్, ఎస్పీ, డీఈవో తదితరులు

కడప ఎడ్యుకేషన్, మే 5 (ఆంధ్రజ్యోతి): చదువుతోనే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని, ప్రణాళికాబద్ధంగా చదివి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆకాంక్షించారు. సోమవారం నగర శివారులోని శిల్పారామంలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల టాప్-10 విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ అశోక్‌కుమార్‌లు హాజరయ్యారు. 2024-25 విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో జిల్లా స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన మొదటి పది మంది విద్యార్థులను కలెక్టర్, ఎస్పీ సన్మానించి మెమెంటోలు అందించారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి ఆత్మీయ విందు భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాణ్యమైన విద్యతో సాధారణ విద్యార్థిని కూడా ఉపాధ్యాయులు విజయవంతమైన స్థాయిలో నిలుపగలరన్నారు. జిల్లాలో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడంలో ఉపాధ్యాయులు ప్రముఖ పాత్ర పోషించారని, ఈ సందర్భంగా వారిని అభినందించారు. జిల్లాలోని సింహాద్రిపురం మండలం రావులకొలను జడ్పీ హైస్కూల్‌కు చెందిన జోషిక పల్లేటి అత్యధికంగా 595 మార్కులు, సిద్దవటం మండలం జడ్పీ హైస్కూల్‌కు చెందిన అతికారి పల్లవి 594, పెండ్లిమర్రి మండలం గంగనపల్లె జడ్పీ హైస్కూల్ నీలం నాగవీరతరుణ్ 593, కాశినాయన మండలానికి చెందిన ఏపీమోడల్ స్కూల్ బండి రామసాయి విగ్నేష్ 593, వేంపల్లె మండలం రామిరెడ్డిపల్లె జడ్పీ హైస్కూల్ విద్యార్థి రుద్ర గంగా జశ్వంత్‌రెడ్డి 592, బద్వేలు మండలానికి చెందిన అతికారి రక్షిత 591, జమ్మలమడుగు మండలం ఎంజేపీఏపీబీసీ డబ్ల్యూఆర్‌ఎస్ (బాలుర) గంజికుంట వెంకట శివసంతోష్ 591, వేముల మండలానికి చెందిన జడ కార్తీక్ 590, జమ్మలమడుగు మండలానికి చెందిన కొట్టం జువేరియ తహసీన్ 590, తొండూరు మండలానికి చెందిన ఎంజేపీ ఏపీబీసీడబ్ల్యూ రెసిడెన్షియల్ స్కూల్ (బాలికలు) గంజికుంట తన్మయి 589 మార్కులు సాధించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. డీఈఓ షంషుద్దీన్ ప్రసంగించారు. కాగా రామకృష్ణ మిషన్, విద్యార్థుల శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి, జడ్పీ సీఈఓ ఓబుళమ్మ, సర్వశిక్ష అభియాన్ ఏపీసీ నిత్యానందరాజు, ఇతర జిల్లా అధికారులు, డిప్యూటీ డీఈఓలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎంవోను తప్పుదోవ పట్టిస్తున్న అధికారులు!

● సమస్య పరిష్కారం కాకున్నా.. ఎండార్సుమెంట్

మదనపల్లె, మే 5(ఆంధ్రజ్యోతి): మండల స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పరిష్కారానికి నోచుకోని అంశాలపై జిల్లా స్థాయిలో కలెక్టరుకు విన్నవించుకోవచ్చు. అక్కడా పరిష్కారం లభించకుంటే సీఎంఓకు ఫిర్యాదు చేయవచ్చు. అయితే, కొన్ని చోట్ల సమస్య పరిష్కారం కాకున్నా పూర్తిగా పరిష్కరించినట్లు ఆయా శాఖ అధికారులు అర్జీదారునికి ఎండార్సుమెంటు ఇచ్చి అటు సీఎంవోను, ఇటు అర్జీదారుడిని తప్పుదోవపట్టిస్తున్నారు. మండలంలోని ప్రభుత్వ స్థలంలో ఆక్రమణల తొలగింపునకు సంబంధించి రెవెన్యూ అధికారుల వ్యవహరించిన తీరు ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది.

మదనపల్లె మండలం రామాచార్లపల్లెకు చెందిన బి.మురళి మదనపల్లె-నిమ్మనపల్లె రోడ్డు పక్కనున్న ప్రభుత్వ రస్తా పోరంబోకును ఆక్రమించి కంచె ఏర్పాటు చేశాడు. ఇందులో నిర్మాణ సామగ్రి నిలువ చేసి పక్కనే ఉన్న పాఠశాలకు వెంటిలేషన్ కూడా లేకుండా చేశాడు. దీనిపై స్థానికులతోపాటు గంగన్నగారిపల్లెకు చెందిన టీడీపీ నేత గంగారపు బాబురెడ్డి, గతేడాది నవంబరులో సీఎంవోకు ఫిర్యాదు చేశారు. సీఎంవో ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలించిన వీఆర్వో, ఆర్‌ఐ, తహసీల్దార్‌లు ప్రభుత్వ స్థలంలోని ఆక్రమణలు తొలగించాలని మురళిని ఆదేశించారు. 60 రోజులు గడువు ఇస్తే, తీసేస్తానని చెప్పాడంటూ రెవెన్యూ అధికారులు అర్జీదారుడికి తెలిపారు. తర్వాత అక్కడున్న రెండు బంకులను తొలగించిన అధికారులు.. మిగిలిన ఆక్రమణలు అలాగే వదిలేశారు. సమస్యను పరిష్కరించినట్లు అటు సీఎంవోకు, ఇటు అర్జీదారుడికి ఎండార్సుమెంట్ ఇచ్చారు. ఎక్కడి ఆక్రమణలు అక్కడే ఉన్నా.. పరిష్కరించినట్లు ఎండార్సుమెంట్ ఇవ్వడంతో అర్జీదారు నిందితుడితోపాటు రెవెన్యూ అధికారులు, సిబ్బందిపై సీఎంవోకు ఫిర్యాదు చేశాడు. మరోవైపు పంచాయతీలో ఇలాంటి ఆక్రమణలు ఎక్కువగా జరుగుతున్నా.. రెవెన్యూశాఖ, రోడ్లు, భవనాలశాఖ, పంచాయతీ రాజ్ అధికారులు ఒకరిపై మరొకరు నిందలు వేసుకుంటూ కబ్జాదారులకు పరోక్షంగా సహకరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నాడు.


పాఠశాల ప్రహరీని ఆనుకుని ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలం

రైతు సమస్యల పరిష్కారం కోసం పాటుపడాలి

● భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు సహదేవరెడ్డి



చెన్నూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులకు ఎలాంటి సమస్యలు వచ్చినా వారి కోసం భారతీయ కిసాన్ సంఘ్ ఎల్లవేళలా పాటుపడాలని సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉమ్మడి సహదేవరెడ్డి అన్నారు. చెన్నూరు ఎంపీఎస్‌ఆర్ కన్వెన్షన్ హాలులో సోమవారం రెండురోజుల పాటు జిల్లాస్థాయి శిక్షణ తరగతుల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా దక్షిణ భారత సంఘటన అధ్యక్షుడు (ఆంధ్ర, తెలెంగాణ, కర్ణాటక) దోనూరు రాము హాజరయ్యారు. ఈ సందర్భంగా సహదేవరెడ్డి మాట్లాడుతూ రైతులకు పంటలసాగులో ముఖ్యంగా విద్యుత్, విత్తనాల సమస్య, ఎరువులు వంటి ఎలాంటి సమస్యలు తలెత్తినా బీకేఎస్ ఆధ్వర్యంలో తక్షణం స్పందించి ఆ సమస్య పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కొండబాబు, శ్రీపతిరాజు, మహేశ్వర్‌రెడ్డి, ఆశాకిరణ్, జనార్ధనరెడ్డి, సంఘ్ నేతలు పాల్గొన్నారు.

వీడియో రికార్డింగ్‌తో త్రీమెన్ కమిటీ విచారణ

● వివాదాంశాలపై మూడు గంటలపాటు విచారణ


ఉపాధ్యాయుడు దేవీప్రసాద్‌ను విచారిస్తున్న త్రీమెన్ కమిటీ

కలికిరి, మే 5 (ఆంధ్రజ్యోతి): కలికిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం, మరో ఉపాధ్యాయుడి మధ్య తలెత్తిన వివాదాలపై జిల్లా అధికారులు ఏర్పాటు చేసిన త్రీమెన్ కమిటీ సోమవారం సుదీర్ఘంగా విచారించింది. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో మూడు గంటలకు పైగా సాగిన విచారణలో హెచ్‌ఎం శారద, తెలుగు భాషోపాధ్యాయుడు దేవీప్రసాద్‌లను విడివిడిగా వివాదాలకు సంబంధించిన పూర్వాపరాల గురించి ఆరా తీశారు. కలికిరి, బి.కొత్తకోట, కురబలకోట ఎంఈవోలు వీరి వాంగ్మూలాలు నమోదు చేశారు. అనంతరం అదే పాఠశాలలో పనిచేసే 12 మంది ఉపాధ్యాయులతో విడిగా మాట్లాడారు. ఈ ఉపాధ్యాయులు చెప్పిన విషయాలన్నీ అంశాల వారీగా విడివిడిగా నమోదు చేశారు. మొత్తం విచారణ ప్రక్రియను వీడియోగ్రఫీ చేయించారు. దాంతోపాటు వ్రాతమూలకంగా కూడా తీసుకున్నారు. దేవీప్రసాద్‌కు సీసీఎల్ మంజూరు చేయడానికి హెచ్‌ఎం శారద తిరస్కరించడానికి గల కారణాలను ఆమె వైపు నుంచి సేకరించారు. అంతేగాకుండా ఈ ప్రత్యేక సెలవు కోసం ఉపాధ్యాయుడి దగ్గర వున్న ఆధారాల గురించి కూడా ఆరా తీసినట్లు సమాచారం. సెలవుకు సంబంధించిన విషయానికి ముందు జరిగిన అనేక వివాదాల గురించి కూడా ఉపాధ్యాయులంతా ఏకతాటిపై పలు అంశాలను విచారణ కమిటీ దృష్టికి తెచ్చినట్లు తెలిసింది. కాగా విచారణ నివేదికను డీఈవోకు పంపనున్నట్లు కమిటీ తరఫున ఎంఈవో కరీముల్లా తెలిపారు. ఆ తరువాత ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. విచారణలో వెల్లడయిన అంశాలన్నీ డీఈవోకు మాత్రమే నివేదిస్తామన్నారు.

కలికిరి మండలానికి 59 యూనిట్లు మంజూరు

కలికిరి, మే 5 (ఆంధ్రజ్యోతి): మైనారిటీ కార్పొరేషన్ ద్వారా మండలానికి 59 యూనిట్లు మంజూరయినట్లు ఎంపీడీవో భానుమూర్తి రావు తెలిపారు. రూ.లక్ష నుంచి 8 లక్షల వరకూ ముస్లిం మైనారిటీలకు, రూ.5 లక్షల వరకూ క్రిస్టియన్ మైనారిటీలకు 50 శాత ం సబ్సిడీతో రుణాలను మంజూరు చేయనున్నట్లు ఆయన తెలిపారు. బ్యాంకుల వారీగా ఎస్బీఐకి 12 యూనిట్లు, బ్యాంక్ ఆఫ్ బరోడాకు 12, యూనియన్ బ్యాంకుకు 12, కలికిరి ఏపీ గ్రామీణ బ్యాంకుకు 12, మహల్ ఏపీజీబీకి 11 యూనిట్లు వంతున కేటాయించినట్లు ఎంపీడీవో వివరించారు. అన్ని రకాల కేటగిరీలకు కలుపుకుని రూ.56.50 లక్షల రుణాలు, రూ.56.50 లక్షల సబ్సిడీతో మొత్తం రూ.1.13 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. 21 నుంచి 60 ఏళ్ల లోపు వయసున్న అర్హులైనవారు ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 25వ తేదీలోగా దరఖాసు చేసుకోవాలని కోరారు. ఆన్‌లైన్ చేసిన అనంతరం దరఖాస్తులకు అన్ని ధ్రువీకరణ పత్రాలు జతపరిచి మండల పరిషత్తు కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. అనంతరం బ్యాంకు అధికారులు, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ప్రతినిధులతో కలిసి ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు.

వెబ్ డెవలపర్ కోర్సు దరఖాస్తుకు రేపే ఆఖరు

మదనపల్లె టౌన్, మే 5(ఆంధ్రజ్యోతి): ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మదనపల్లె జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న వెబ్ డెవలపర్ కోర్సుకు దరఖాస్తు చేసుకునేందుకు బుధవారం చివరి రోజని ప్రిన్సిపాల్ ఓబులేసు ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు 95532 02509కు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

శివాలయానికి లక్ష రూపాయల విరాళం

పెద్దతిప్పసముద్రం మే 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయానికి సోమవారం బెంగళూరుకు చెందిన పద్మజ, ఎంఎస్ శంకర దంపతులు లక్ష రూపాయల విరాళాన్ని ఆలయ నిర్వాహకులు శ్రీ ననగరం పట్టాభిరామయ్యకు అందించారు. ఈ సందర్భంగా దాతలను సన్మానించారు. ఆలయంలో అన్నదాన కార్యక్రమానికి అమెరికాకు చెందిన అమడగూరు వెంకటేష్ రూ. 5వేలు ఇచ్చినట్లు పట్టాభిరామయ్య తెలిపారు.

నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడికి సన్మానం

మదనపల్లె అర్బన్, మే 5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్యాలక్కగారి సుబ్రహ్మణ్యం షష్టి పూర్తి సందర్భంగా సోమవారం పట్టణంలోని నాయీబ్రాహ్మణ సంఘం సభ్యులు, బీసీ సంఘం నాయకులు శాలువా కప్పి పూలమాలతో సన్మానించారు కార్యక్రమంలో బీసీ నాయకులు జెన్నే రాజేంద్రనాయుడు, తెలుగుదేశం పట్టణ నాయకులు, మాజీ సైనిక ఉద్యోగి వెంకటస్వామి, హాస్టల్ వార్డన్ వెంకటేష్, చాకలిసంఘం అధ్యక్షుడు కట్టా గంగులప్ప, ఎల్ఐసీ నరసింహ యాదవ్, రిటైర్డ్ కానిస్టేబుల్ విశ్వనాథ్, సోంపాలెం శ్రీనివాసులు, సుధా, మంజునాథ్, తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు

మదనపల్లె అర్బన్, మే5(ఆంధ్రజ్యోతి): స్థానిక వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో సోమవారం ఆరాధనోత్సవాలు నిర్వహించారు. ఉదయాన్నే పూజారులు బ్రహ్మాచారి, చెంగాచార్యులు పూజలు నిర్వహించారు. హోమాలు చేశారు. 9వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు, సభ్యులు తెలిపారు.

బ్రహోత్సవాలకు అంకురార్పణ

మదనపల్లె అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక దేవళంవీధిలోని ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయంలో ఆలయ ఈవో రమణ, అధికారులు సోమవారం బ్రహోత్సవాలకు అంకురార్పణ చేశారు. ఇందులో భాగంగా వెంకటరమణ స్వామి మూల విరాట్లకు అభిషే కాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీసభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రేపు మాజీ సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి కలికిరికి రాక

కలికిరి, మే 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఏపీ మాజీ సీఎం, బీజేపీ నాయకుడు నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి బుధవారం కలికిరి రానున్నట్లు ఆయన వ్యక్తిగత కార్యదర్శి ఎం.కృష్ణప్ప తెలిపారు. బుధవారం సాయంకాలం 5 గంటలకు మదనపల్లె లో కొన్ని కార్యక్రమాలు హాజరు కానున్నారు. అక్కడి నుంచి రాత్రి 7.45 గంటలకు కలికిరికి చేరుకోనున్నారు. మరుసటి రోజు గురువారం సాయంకాలం 4.10కు బయలుదేరి 6.20 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుని అక్కడి నుంచి హైదరాబాదు వెళ్ళనున్నారని కృష్ణప్ప వివరించారు.

వృద్ధులకు వస్త్రాలు పంపిణీ



వృద్ధులకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న సాయి తదితరులు

మదనపల్లె అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీకే పల్లెలోని ఆనంద వృద్ధాశ్రమంలోని వృద్ధులకు సోమవారం కర్ణాటకకు చెందిన శ్రీసాయి సేవా ఫౌండేషన్ ఫౌండర్ సాయి స్వామి వారి పుట్టినరోజును పురస్కరించుకుని వస్త్రాలు పంపిణీ చేశారు. ఆశ్రమంలో ధాత్రి ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్ స్వాతి, కో ఆర్డినేటర్ చక్రపాణి ఆధ్వర్యంలో 30 మందికి దుస్తులతోపాటు అన్నదానం నిర్వహించారు. ఇలాంటి దాతల సాయంతో ఎంతో మందికి ఆశ్రయం ఇస్తున్నట్లు తెలిపారు. సాయి స్వామికి కృత.జ్ఞతలు తెలిపారు.

గుట్టుచప్పుడు కాకుండా.. కుట్టు శిక్షణ!

- నగరపంచాయతీ కమిషనర్‌కే సమాచారం లేదట!
- టీడీపీ నేతల అసహనం



శిక్షణ పొందుతున్న మహిళలు

బి.కొత్తకోట, మే 5(ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పడు కాకుండా కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభించడం మండల కేంద్రంలో చర్చనీయాంశమైంది. స్థానిక బైపాస్‌రోడ్డులోని వెలుగు కార్యాలయ పాత భవనంలో వారం రోజులుగా మహిళలకు కుట్టు శిక్షణ ఇస్తుండడంపై మండల టీడీపీ కన్వీనర్ నారాయణస్వామిరెడ్డి, పలువురు పట్టణ నాయకులతో కలిసి అధికారులను నిలదీశారు. ఈ కేంద్రాన్ని ఎవరు ప్రారంభించారు? ఎవరి ఆధ్వర్యంలో నడుస్తోంది? లబ్ధిదారులను ఎవరు ఎంపిక చేశారు? ఎవరికీ సమాచారం లేకుండా ఎలా చేస్తారు అని ప్రశ్నించారు. నగరపంచాయతీ కమీషనర్ జీవీ పల్లవిని ఈ విషయమై ప్రశ్నించగా తనకు సమాచారం లేదని, ఈ శిక్షణ కోఆర్డినేటర్‌గా చెబుతున్న స్వాతిని విచారణ చేయగా రెండు రోజుల్లో వచ్చి మాట్లాడతానని చెప్పారని తెలిపారు. అయితే ఈ శిక్షణ కేంద్రంపై అధికారపార్టీ నాయకులే తీవ్ర ఆరోపణలు చేస్తుండటం కొసమెరుపు. శిక్షణ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారిలోనుంచి ఇష్టారాజ్యంగా లబ్ధిదారులను ఎంపిక చేసుకుని, అవసానదశలో ఉన్న కుట్టుమిషన్‌లతో, కనీసం ప్రెస్‌కు కూడా చెప్పకుండా ఎలా నిర్వహిస్తారని విమర్శిస్తున్నారు. ఒక్కో మహిళకు నెలకు రూ.3000 స్టైపెండ్ వస్తుందని దానిని కాజేయడానికి బినామీ పేర్లతో గుట్టుగా నడుపుతున్నారని, దీనిపై విచారించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించమంటే కక్ష సాధిస్తున్నారు

- తహసీల్దార్‌కు ఆర్టీసీ కార్మికుల వినతి



పీలేరు తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆర్టీసీ కార్మికులు



సబ్‌కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఎన్ఎంయూ నాయకులు

పీలేరు రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించమని వేడుకుంటుంటే కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆర్టీసీ ఎన్ఎంయూ జిల్లా కార్యదర్శి పీ.ఎస్.ఎం రాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం పీలేరు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఆరు నెలలుగా శాంతియుతంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించి నా సంస్థ యాజమాన్యం కనీసం పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రతా సర్క్యులర్ 2019 అమలు చేయాలని, అక్రమంగా కార్మికులపై కేసులు పెటకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం సంరక్షణ సెలవులు మంజూరు చేయాలని కోరారు. మహిళా కండక్టర్లకు కనీస అవసరాలు తీర్చుకోవడం కోసం డిపోల్లో వసతులు కల్పించాలని కోరారు. లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ సత్వరం అమలు చేయాలని, నైట్ అలవెన్స్ రూ. 150 నుంచి రూ. 400 పెంచాలని డిమాండ్ చేశారు. ఈహెచ్ఎస్ విధానానికి బదులుగా పాత వైద్య విధానం అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం లేదా ఆర్టీసీ సంస్థ ఎలక్ట్రిక్ బస్సులు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. నాలుగేళ్లుగా ఆగిపోయిన పదోన్నతులను తక్షణం ఇవ్వాలని కోరారు. సంస్థలో పనిచేస్తూ మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు సత్వరం బకాయిలు చెల్లించాలని తెలిపారు. పదవీ విరమణ చేసిన సిబ్బందికి పెన్షన్ లేనందున ఆరోగ్యశ్రీ, పెన్షన్‌తోపాటు ఇతర ప్రభుత్వ రాయితీలు అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. పలు న్యాయమైన డిమాండ్లు పరిష్కరించేలా ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావాలని కోరుతూ తహసీల్దార్ భీమేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. యూనియన్ నాయకులు పీ.వీ. రమణ, ఆదినారాయణ,రఘు,హరినాథ్ పాల్గొన్నారు.

మదనపల్లె టౌన్ : ఏపీఎస్ ఆర్టీసీ సంస్థలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీపీటీడీ ఎన్ఎంయూ నాయకుడు వినోద్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్ వద్ద ఎన్ఎంయూ నాయకులు నిరసన తెలిపారు. కనీస వేతనం రూ.35వేలు మంజూరు చేయాలని ఏఐటీయూసీ నాయకులు నిరసన తెలుపుతూ కనీస వేతనాల బోర్డును తక్షణమే నియమించాలని, 12 నెల వేతన బకాయిలు విడుదల చేయాలన్నారు.

ఇంటి పట్టా మార్చేశారు

- వైసీపీ సర్పంచ్‌పై సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న బీవైఎస్ నాయకులు

మదనపల్లె టౌన్, మే 5(ఆంధ్రజ్యోతి): తన తల్లి జయమ్మ పేరుతో ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి స్థలాన్ని సర్పంచ్ అత్త జయమ్మకు అక్రమంగా బదలాయించారని అంకిశెట్టిపల్లె సర్పంచ్ శరత్ రెడ్డిపై ఓ గిరిజనుడు సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సోమ వారం స్థానిక సబ్ కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో తుమ్మలతాండాకు చెందిన జగదీష్‌నాయక్‌మాట్లాడుతూ 2006-07లో తన తల్లి జయమ్మ పేరిట ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి స్థలం రికార్డుల్లో సర్పంచ్ అత్త అయిన జయమ్మ ఫొటో అతికించి మార్చేశారని ఆరోపించారు. ఆ స్థలంలో తాము నిర్మించిన పునాదులు కూడా తొలగించి, అప్పటి వీఆర్వో ద్వారా ఫైలు నెం బరు తారుమారు చేశారని, దీనిపై విచారించి తమకు న్యాయం చే యాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ విద్యాసంవత్సరం నుంచి కొత్త కోర్సులను ప్రవేశపెట్టాలని బీవైఎస్ అధ్యక్షుడు పునీత్ సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ కళాశాలలో ఇంటర్ మీడి యట్ కోర్సులు లేవని, అన్ని వసతులు వున్న బీటీ కళాశాలలో ఇంటర్ కోర్సులను తిరిగి ప్రవేశపెట్టాలన్నారు. వీటితో పాటు పలువురు భూ సమస్యలు, రెవెన్యూ సమస్యలపై సబ్‌కలెక్టర్ వినతులు అందజేశారు. వీటిని నిర్దేశిత సమయంలో పరిష్కరించాలని ఆయా ప్రభుత్వ శాఖ అధికారులను సబ్‌కలెక్టర్ ఆదేశించారు

'ప్రజల చేతుల్లో పాశుపతాస్త్రం సమాచార చట్టం'

మదనపల్లె, మే 5(ఆంధ్రజ్యోతి): ప్రజల చే తుల్లో సమాచార హక్కు చట్టం-2005 పాశు పతాస్త్రం లాంటిదని మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల తెలిపారు. ఈ చట్టంతో పాలన వ్యవస్థలు, అధికారుల్లో పారదర్శకత, జవాబు దారీతనం పెరిగిందన్నారు. సమాచార హ క్కు చట్టాన్ని ప్రజలకు మరింత చేరువ చేసే క్రమంలో ఏపీ సమాచార హక్కు కమిషనర్ అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. ఇందులో భాగంగా మున్సిపాలిటీలోని 43 వార్డు సచివాయాల్లో సోమవారం నుంచి అయిదు రోజులపాటు అవగాహన కార్యక్రమాలు ప్రారంభించారు. పట్టణంలోని అమ్మచెరువుమిట్ట, వైఎస్ఆర్‌నగర్, ముజీబ్‌నగర్, శివాజీనగర్, రామారావు కాలనీ-1, 2, ఎస్‌బీఐ కాలనీ, గొల్లపల్లె, నిమ్మనపల్లె రోడ్డు వార్డు సచివాలయాల్లో సదస్సులు నిర్వహించి, చట్టం ఉద్దేశాన్ని ప్రజలకు వివరించారు. కమిషనర్ కె.ప్రమీల ఎనిమిది సచివాలయాల్లో పర్యవేక్షించారు. మున్సిపల్ మేనేజర్ పి.ఆర్.మనోహర్, ఆర్వో విజయ్‌కుమార్, డీఈ శ్రావణి, ఆర్ఐలు కె.శ్రీనివాసులు, తిరుమల, గిరిధర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించమంటే దురుసుగా ప్రవర్తిస్తున్నారు

- తహసీల్దార్ పనితీరుపై రైతుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు, ప్రజా సంఘాల ప్రతినిధులు

రామసముద్రం, మే 5 (ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దార్ నిర్మలాదేవి పనితీరుపై మండల రైతులు, ప్రజా సంఘాలు, ప్రజా ప్రతినిధులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసం వచ్చే రైతులు, ప్రజాప్రతినిధులపై దురుసుగా ప్రవర్తించడంతోపాటు సమస్యల పరిష్కారంలో జాప్యం చేస్తోందని ఆరోపించా. గ్రీవెన్స్ డే రోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకే అర్జీలు స్వీకరిస్తుండడంతో , సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు నిరుత్సాహంతో వెనుదిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు ఫ్యామిలీ సర్టిఫికెట్ కోసం వీఆర్ఏ, వీఆర్వో, అనుమతి ఇచ్చినా, కుటుంబ సభ్యులందరూ తహసీల్దార్ కార్యాలయానికి వస్తే తప్ప ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎర్రనేలపల్లె, చిట్టెంవారిపల్లె రైతులు మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారంలో తమకు అన్యాయం జరిగిందని పూర్తి విచారణ చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం వెళితే దురుసుగా ప్రవర్తిస్తున్నారని, ఈ విషయం జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తామని కమ్మవారిపల్లె సర్పంచ్ ఇంజం వెంకటరమణనాయుడు, మాజీ సర్పంచ్ చలపతి నాయుడు తెలిపారు. తహసీల్దార్ నిర్మలాదేవి తీరును నిరసిస్తూ సోమవారం మండలంలోని రైతు సంఘాలు, ప్రజా ప్రతి నిధులు, కుల సంఘాలు తహసీల్దార్ కార్యాల యం ఎదుట నిరసన వ్యక్తం చేయాలని ప్రయత్నించగా అనుమతి లేదని పోలీసులు అడ్డుకున్నారు. దీనితో కార్యక్రమం వాయిదా వేసుకున్న రైతులు పద్ధతి మార్చుకోకపోతే కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సమతా సైనిక్ దళ్ మండల శాఖ అధ్యక్షుడు జయరాజ్, సభ్యులు బాలాజి, కొమ్ము నారాయణస్వామి, రమణ, రామాంజులు, టీడీపీ నేతలు, సుధాకర్‌రెడ్డి, టేకుపల్లె రమణ, వెంకటేష్, పలువురు రైతులు పాల్గొన్నారు.

కుల ఉగ్రవాదాన్ని అంతం చేయాలి



జెండా ఆవిష్కరిస్తున్న పీటీఎం శివప్రసాద్

మదనపల్లె, మే 5 (ఆంధ్ర జ్యోతి): మత ఉగ్రవాదం కంటే కుల ఉగ్రవాదం అ త్యంత ప్రమాదకరమని బా స్ వ్యవస్థాపక అధ్యక్షుడు పీటీఎం శివప్రసాద్ అన్నా రు. మదనపల్లె రూరల్ మండలంలోని ననసమాకుల పల్లెలో సోమవారం బాస్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుల ఉగ్రవాదాన్ని కఠిన చర్యలతో అంతం చేయాలన్నారు. దేశానికి స్వాంతంత్ర్యం సిద్ధించి 78 ఏళ్లు దాటినా ఇప్పటికీ కుల వివక్ష తొలగిపోలేదన్నారు. కుల ఉగ్రవాదాన్ని అంతం చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయన్నారు. వ్యవసాయం చేసే ప్రతి దళిత కుటుం బానికి భూమి పంచాలన్నారు. కాగా స్థానికులు శివప్రసాద్‌కు ఘన స్వాగతం పలికి అంబేడ్కర్ చిత్రపటాన్ని బహూకరించారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి

మదనపల్లె అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని క్షేత్ర రెవెన్యూ శాఖ ఉద్యోగులను తహసీల్దార్ ధనంజయులు ఆదేశించారు. సోమవారం ప్రజల నుంచి సమస్యలపై అర్జీలను స్వీకరించారు.

115 మందికి వైద్య పరీక్షలు



మెడికల్ క్యాంపులో పాల్గొన్న పర్వీన్‌తాజ్

బి.కొత్తకోట, మే 5(ఆంధ్ర జ్యోతి): టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్ పర్యవేక్షణలో సోమవారం బి.కొత్తకోట పట్టణంలో నిర్వహించిన ఉచిత మెడికల్ క్యాంపునకు మంచి స్పందన లభించింది. తిరుపతిలోని రమాదేవి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు చెందిన వైద్యుడు వెంకటేశ్ రోగులను పరీక్షించారు. ఈ శిబిరంలో 115 మంది వైద్య పరీక్షలు చేయించుకోగా, 22 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో చావిడి కిట్టన్న, ఎండీ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలసిన కూటమి నేతలు



మంత్రితో చర్చిస్తున్న రామ్‌దాస్‌చౌదరి, మల్లికార్జుననాయుడు

మదనపల్లె, మే 5 (ఆంధ్రజ్యోతి): మదనపల్లెకు చెందిన కూటమి నేతలు క్రీడలు, రవాణాశాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డిని సోమవారం రాయచోటిలోని పార్టీ కార్యాలయంలో కలిశారు. మద నపల్లె, తంబళ్లపల్లె రాజకీయ అంశాలపై చర్చించారు. జనసేన రాయలసీమ కో-ఆర్డినేటర్ గంగారపు రామ్‌దాస్‌చౌదరి, తంబళ్లపల్లె నేత కోఫూరి మల్లికార్జుననాయుడు, మార్పూరి శశిధర్‌రావు, తదితరులు ఉన్నారు.

రూ.కోటితో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



పవర్‌ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న ఎస్పీడీసీఎల్ అధికారులు

మదనపల్లె టౌన్, మే 5(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలను నివారించేందుకు రూ.కోటితో 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నామని ఎస్పీడీసీ ఎల్ ఈఈ గంగాధరం తెలిపారు. సోమవారం స్థానిక సీటీఎం రోడ్డులోని సబ్‌స్టేషన్ వద్ద పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి విద్యుత్ కనెక్షన్లను ఇవ్వడం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ ఎస్పీడీసీఎల్ కార్యాలయ ఆవరణలోని సబ్‌స్టేషన్‌లో ఒక 8 ఎంవీఏ, ఒక 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఉన్నాయని, ఇందులో 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ తీసివేసి దాని స్థానంలో 8ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. మొత్తం 16 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్లతో పట్టణంలో తూర్పు ప్రాంతానికి పది రోజుల్లో నిరవధిక విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. ఈ సబ్‌స్టేషన్ నిర్మించి 70 ఏళ్లు గడిచిన కారణంగా ఎర్త్ మ్యాట్, ఫెన్సింగ్ దెబ్బతిన్నాయని, వీటి మరమ్మతులకు రూ.50 లక్షలతో పనులు ప్రారంభి స్తామన్నారు. డీఈఈ హరికుమార్, ఏఈలు అజయ్‌బాబు, ముజమ్మిల్, కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

20 మంది వీఆర్ఏలకు పదోన్నతులు



పదోన్నతి పొందిన వీఆర్ఏలతో సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె టౌన్, మే 5(ఆంధ్రజ్యోతి): మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో విధులు నిర్వహిస్తున్న 20 మంది వీఆర్ఏలకు పదోన్నతులు కల్పించినట్లు సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ తెలిపారు. సోమవారం ఈ మేరకు ఉత్తర్వులను విడుదల చేశారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. కాగా పదోన్నతులు పొందిన వారిలో 15 మందికి ఆఫీస్ సబార్డినేటర్ పోస్టులు, ఐదుగురికి వాచ్‌మన్ పోస్టులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సబ్‌కలెక్టరేట్ డీఏవో రాఘవేంద్ర, పదోన్నతులు పొందిన వారు వున్నారు.

సబ్సిడీపై పశువుల దాణా పంపిణీ



పశువులదాణా పంపిణీ చేస్తున్న డాక్టర్ సురేష్, టీడీపీ నాయకులు

నిమ్మనపల్లి, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాడి రైతులకు 50 శాతం సబ్సిడీపై పశుదాణా పంపిణీ చేయడం హర్షణీయమని మండల టీడీపీ అధ్యక్షుడు వెంకటరమణ తెలి పారు. సోమవారం స్థానిక పశువైద్యశాలలో దాణా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి సురేష్ మాట్లాడుతూ నిమ్మన˘ఎల్లి, కొండయ్యగారిపల్లి, సామకోటవారిపల్లి, తవళం పంచాయతీలకు 250 బస్తాల దాణా వచ్చినట్లు తెలిపారు. ఎస్సీఎస్టీ కేటగిరీల పాడి రైతులు మాత్రమే ఈ పథకం ద్వారా దాణా పొందవచ్చని తెలిపారు. బస్తా రూ.1110లు కాగా సబ్సిడీలో రూ.555లకే పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మన్న, రాజన్న, సుధాకర్, షఫి, మల్లప్ప, రెడ్డెప్పరెడ్డి, మల్లికార్జున, భూపతి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుదారుల సమస్యలు పరిష్కరించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

వాల్మీకిపురం, మే 5(ఆంధ్రజ్యోతి): రేషన్ షాపుల్లో సరుకులు పొందేందుకు ఎదుర్కొంటున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావని మండల బీజేపీ అధ్యక్షుడు జాకీర్‌హుస్సేన్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ చౌక దుకాణాలతో ఇబ్బందులపై సోమవారం స్థానిక తహసీల్దార్ పామిలేటిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం చౌక దుకాణాల ద్వారా అందజేస్తున్న బియ్యం, సరుకుల పంపిణీకి ఒక నిర్ణీతమైన సమయం లేకపోవడం, ప్రస్తుతం ఉన్న పంపిణీ వ్యవస్థ కారణంగా ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరించారు. బియ్యం పంపిణీ వ్యవస్థలో మార్పులు చేసి, గతంలో మాదిరిగా నిర్ణీత సమయాన్ని కేటాయించాలని కోరారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ మాట్లాడుతూ సమస్యను ఉన్నతా ధికారుల దృష్టికి తీసుకెళతానన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు గోవింద రాజులు, తదితర నాయకులు పాల్గొన్నారు.

సికిల్‌సెల్ అనీమియా పరీక్షలు తప్పనిసరి



సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ మహ్మద్‌రఫీ

వాల్మీకిపురం, మే 5(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితులలో ఆరోగ్య పరీక్షలతో పాటుగా సికిల్‌సెల్ అనీమియా పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని వాల్మీకిపురం మండల హెల్త్ ఎడ్యుకేటర్ మహ్మద్‌రఫీ తెలిపారు. మండలంలోని షికారి పాళెం గ్రామంలో సోమవారం చింతపర్తి పీహెచ్‌సీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ సికిల్‌సెల్ అనీమియా గురించి తెలియజేశారు. అనంతరం ముందస్తు పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధులను ఆదిలోనే గుర్తించి మంచి వైద్యం చేసుకునే వెసులుబాటు ఉంటుందని, వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ చూపాలని సూచించారు. అనంతరంలో గ్రామం లో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్ర మంలో టీబీ సూపర్‌వైజర్ నాగిరెడ్డి, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్యకు దరఖాస్తు చేసుకోవాలి



ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎంఈవో రెడ్డిబాషా

పీలేరు రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాలల్లో 1వ తరగతిలో 25 శాతం సీట్లను ప్రభుత్వం పేద విద్యార్థులకు కేటాయించిందని, అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కేవీపల్లె ఎంఈవో పీ. రెడ్డిబాషా తెలిపారు. సోమవారం కేవీపల్లె మండలం గర్నిమిట్ట గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం 12-1సీ ప్రకారం ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 2025-26 విద్యాసంవత్సరంలో 25 శాతం సీట్లు 1వ తరగతిలో ఉచితంగా పొందవచ్చునని తెలిపారు. ఇందుకోసం అర్హులైన వారు సత్వరం దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. మే 2వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు. మండలంలో తల్లిదండ్రులు లేని పిల్లలు, హెచ్ఐవీ బాధితులు, దివ్యాంగులు, ఎస్టీ. ఎస్సీ, బీసీ, మైనారిటీ, అల్పాదాయ వర్గానికి చెందిన ఓసీలు అర్హులన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. ఎంఈవో సచివాలయ సిబ్బంది సింధూజ, వి. సుమతి, అమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై మండల స్థాయి సమావేశం

పెద్దతిప్పసముద్రం మే 5 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల సమాఖ్య భవనంలో సోమవారం ప్రకృతి వ్యవసాయ మండల స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారిణి ప్రేమలత మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో రైతులకు బహుళ ప్రయోజనాలు ఉన్నాయన్నారు. మండలంలోని కందుకూరు, సంపతికోట గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా టమోటా, వంగ, గోరుచిక్కుడు, బెండ, బీర, ముల్లంగి, క్యారెట్ బీట్రూట్, క్యాప్సికం వంటి కూరగాయాలను ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించి రైతులు లాబాలు గడిస్తున్నారన్నారు. రాబోవు రోజుల్లో అన్ని గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించేందుకు రైతులకు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంటీ. రఘునాథ్, మోడల్ మేకర్ సుబ్బరాము, ఎల్1 మల్లమ్మ, ఐసీఆర్పీ ు పీఈ. పవన్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శివశంకర్

పీలేరు రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలని పీలేరు ఎంపీడీవో శివశంకర్ అన్నారు. సోమవారం పీలేరు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇతర శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు విధిగా పాటించాలని తెలిపారు. రోజువారీ సమస్యలపై సచివాలయాలకు వచ్చే వారితో నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తే చర్యలు తప్పవన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్ర మాల అమలులో కార్యదర్శుల పాత్ర కీలకమని తెలిపారు. ప్రతి గ్రామంలో తాగునీరు, రహదారులు, సీసీ రోడ్ల నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు, శానిటేషన్ కార్యక్రమాల నిర్వహణపై ప్రతి ఒక్కరూ చొరవ చూపాలని, ఇందులో ఎవరైనా నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో లతీఫ్‌ఖాన్, పీలేరు ఈవో గురుమోహన్, కార్యదర్శులు పాల్గొన్నారు.